ఆంధ్రజ్యోతి

ANDHRAJYOTHY

నంద్యాల

జిల్లా వార్తలు 5

ఆదివారం 30 జూన్ 2024



మహానందిలో మొండి బకాయిలు..!

- దేవస్థాన పరిధిలో రూ.1.70 కోట్ల పాత పద్దులు
- కొన్నేళ్లుగా వసూలు కాని వైనం
- రాజకీయ ఒత్తిడులే కారణం



దేవస్థాన పరిధిలోని దుకాణాలు

నంద్యాల, జూన్ 29 (ఆంధ్రజ్యోతి): మహానంది క్షేత్రంలో మొండి బకాయిలు పేరుకుపోయాయి. కొన్నేళ్లుగా బకాయిలు వసూలు కావడం లేదు. దీనికి రాజకీయ ఒత్తిడిలే కారణమని తెలుస్తోంది. దేవస్థాన పరిధిలో రూ.1.70 కోట్ల పాత పద్దులు ఉన్నాయంటే పరిస్థితి ఎలా ఉందో అర్థం చేసుకోవచ్చు. కొత్తగా వచ్చిన ఈవో వీటిపై దృష్టి పెడతారా లేదా అన్నది వేచి చూడాలి.

రూ. 1.11 కోట్లకు పైగా లీజు బకాయిలు..

మహానంది దేవస్థానం టోల్‌గేట్, వాహనాల పూజలు, పెళ్లి కార్యక్రమాలు, చెప్పుల స్టాండ్ వంటి ఎనిమిదింటికి సంబంధించిన నిర్వహణను లీజుకు ఇచ్చింది. వీటికి సంబంధించిన బకాయిలు 2018 - 19 నుంచి భారీగా పేరుకుపోయాయి. కేవలం ఈ ఎనిమిదింటికి సంబంధించిన లీజుల బకాయిలే రూ.1,11,69,000 ఉన్నాయి. ఇందులో ముఖ్యంగా దేవస్థాన టోల్‌గేట్‌కు సంబంధించి 2020-21 సంవత్సరానికిగాను రూ. 34.41 లక్షలు, 2021 - 22 సంవత్సరానికిగాను రూ. 24.03 లక్షలు, చెప్పుల స్టాండ్ బకాయిలు 2019 - 20 సంవత్సరానికిగాను రూ.12.52 లక్షలు, పెద నంది దగ్గర ఫొటోల లీజుకు సంబంధించి 2019- 20 సంవత్సరానికిగాను రూ. 8.52 లక్షలు, మరుగుదొడ్ల నిర్వహణకు సంబంధించి 2018 - 19 రూ. 5.06 లక్షలు, 2019-20 సంవత్సరానికి గాను రూ. 11.30 లక్షలు, అగరుబత్తీల లీజుకు సంబంధించి 2023-24 సంవత్సరానికి గాను రూ. 3.90 లక్షలు, సెల్ పాయింట్, లగేజీ నిర్వహణకు సంబంధించి 2019 - 20 సంవత్సరానికి గాను రూ.3.30 లక్షలు పెండింగ్‌లో ఉన్నాయి. ఇవన్నీ పెద్ద మొత్తాలు కాగా, మిగిలిన వాటి లీజుకు సంబంధించి ఆయా సంవత్సరాలకు గాను రూ. 17 వేల నుంచి రూ.2 లక్షల వరకు పెండింగ్‌లో ఉన్నాయి. అయితే ఈ లీజులకు సంబంధించిన బకాయిలు చాలా వరకు కరోనా కాలంలోనివేనని, ఆ సమయంలో దేవస్థానానికి భక్తుల రాక పూర్తిగా లేకపోవటం వల్ల తాము తీసుకున్న లీజుకు సరిపడా ఆదాయం రాలేదని, కాబట్టి ఆ బకాయిలను మినహాయించాలని లీజుదారులు దేవదాయ కమిషనర్‌కు గతంలో అర్జీ పెట్టుకున్నారు. దానికి అంగీకరించని కమిషనర్ బకాయిలు కట్టాల్సిందేనని, వాటిని వసూలు చేసే బాధ్యత దేవస్థాన అధికారులదేనని తేల్చింది. అయినా లీజుదారుల నుంచి డబ్బులు వసూలు చేయటంలో గత ఈవో విఫలమయ్యారు.

దుకాణాల బకాయిలు రూ. 16 లక్షలు

మహానంది దేవస్థానం పరిధిలో సంబంధిత అధికారులు 2002వ సంవత్సరంలో 69 దుకాణాలతో ఓ షాపింగ్ కాంప్లెక్స్ నిర్మించారు. కొన్ని అనివార్య కారణాల వల్ల ఈ ఏడాది జనవరిలో షాపింగ్ కాంప్లెక్సులోని కొన్ని దుకాణాలను కూల్చేసి, మిగతా దుకాణాలను విశాలంగా చేశారు. ప్రస్తుతం 49 దుకాణాలు అందుబాటులో ఉండగా, వీటిలో కొన్ని దుకాణాలు వ్యాపారానికి అనుకూలంగా లేవన్న ఉద్దేశంతో లీజుకు తీసుకునేందుకు ఎవరూ ముందుకు రాలేదు. ప్రస్తుతం 30 దుకాణాలు లీజు పద్ధతిలో నడుస్తున్నాయి. గతంలోని దుకాణాల లీజుకు సంబంధించిన వాటితో పాటు ప్రస్తుతం వినియోగంలో ఉన్న దుకాణాలకు సంబంధించిన బకాయిలు రూ. 16.02 లక్షలు పెండింగ్‌లో ఉన్నాయి. కొన్ని దుకాణాలకు సంబంధించిన బకాయిలు 2008వ సంవత్సరం నుంచి పెడింగ్‌లో ఉండటం గమనార్హం. ఇవన్నీ ఎపుడు వసూలు అవుతాయన్నది ఆ మహానందీశ్వరుడికి కూడా అంతుపట్టడం విషయంగా మారిందన్న విమర్శలు వినిపిస్తున్నాయి.



పంటలు పండించుకుంటూ..

దేవస్థానానికి సంబంధించి భూములు దాదాపు 354 ఎకరాలు ఉండగా, ప్రస్తుతం 111 ఎకరాలు మాత్రమే దేవస్థానం కౌలుకు ఇస్తోంది. మిగిలినవి అన్యాక్రాంతమైనట్లు తెలుస్తోంది. ప్రస్తుతం కౌలుకు ఇచ్చిన భూమి అంతా సారవంతమైనదే. ఈ భూములకు కాల పరిమితిని నిర్ణయిస్తూ రైతులకు కౌలుకు ఇస్తోంది. అయితే ఈ భూముల నుంచి రావాల్సిన ఆదాయం కూడా దేవస్థానానికి సరిగా చేరడం లేదు. ఈ కౌలు భూములకు సంబంధించి రూ. 35.16 లక్షల బకాయిలు పెండింగ్ ఉన్నాయి. కొన్ని భూములకు సంబంధించిన బకాయిలు 2003 నుంచి ఉండటం గమనార్హం. ప్రతి ఏటా పంటలు పండించుకుంటున్న కౌలుదారులు దేవునికి కౌలు కట్టడానికి ఇష్టపడటం లేదు. ఇలా దేవుడి ద్వారా లాభం పొందుతున్న వారంతా ఆ దేవుడికి శఠగోపం పెడుతున్నారు. ఈ పెండింగ్ బకాయిలను వసూలు చేసి దేవాలయ అభివృద్ధికి ఖర్చు పెడితే భక్తులకు మరిన్ని సౌకర్యాలు సమకూరటమే కాకుండా, రద్దీ పెరిగి మరింత ఆదాయం వస్తుందన్న అభిప్రాయం వ్యక్తమవుతోంది.

నోటీసులు పంపిస్తాం



నేను ఇక్కడికి అదనపు బాధ్యతలు మీద వచ్చాను. పైగా బాధ్యత తీసుకుని ఒక రోజు మాత్రమే అవుతోంది. దేవస్థానం బకాయిలకు సంబంధించి అధికారులు, సిబ్బందితో చర్చించాను. బకాయిలు ఎక్కువగానే ఉన్నాయని తెలుస్తోంది. ఆయా లీజులకు సంబంధించిన బకాయిలు ఉన్న వారికి నోటీసులు పంపిస్తాం. తప్పకుండా బకాయిలను సాధ్యమైనంత మేర త్వరగా వసూలయ్యేలా చూస్తాం.

\- ఎన్. శ్రీనివాసరెడ్డి, ఈవో (ఎఫ్ఏసీ), మహానంది దేవస్థానం

రాజకీయ పలుకుబడితో..

మహానంది పేరుకు దేవస్థానం అయినా.. ఇక్కడి అన్ని విషయాల్లో రాజకీయమే నడుస్తోందన్న వాదన ఉంది. పెండింగ్ బకాయిలకు కూడా ఇదే కారణమని తెలుస్తోంది. ఏళ్ల తరబడి దేవస్థాన పరిధిలో పాతుకుపోయి, రాజకీయ అండతో లీజుదారులు, దుకాణదారులు, కౌలుదారులు తమ హవా కొనసాగిస్తున్నారన్న విమర్శలు ఉన్నాయి. వాస్తవానికి ఏదైనా లీజు, దుకాణ వేలం పాట, కౌలుకు సంబంధించి బకాయిలు పెండింగ్‌లో ఉంటే.. మరుసటి సంవత్సరం ఆ వ్యక్తులను వేలం పాటకు అనర్హులుగా దేవస్థానం నిర్ణయిస్తుంది. అయితే క్షేత్రస్థాయిలో ఓ సారి పరిశీలిస్తే.. ఏళ్లుగా అక్కడ వ్యాపారం, వ్యవసాయం చేసుకుంటున్న వారే మళ్లీ మళ్లీ కనిపిస్తుంటారు. బకాయిలు పెండింగ్‌లో ఉంచి కూడా వారే లీజు లేదా కౌలును ఎలా దక్కించుకుంటున్నారన్న ప్రశ్న ఉత్పన్నమవుతుంది. అయితే ఇక్కడే మతలబు ఉన్నట్లు తెలుస్తోంది. బకాయిలు ఉన్న వ్యాపారులు, రైతులు మరుసటి ఏడాది వేలం పాటలో తమ తరఫున వేరే వారు పాల్గొనేలా చేసి, ఆ తర్వాత నిర్వహణను తమ చేతుల్లోనికి తీసుకుంటున్నట్లు సమాచారం. దీని వల్ల బకాయిలు ఉన్నా కూడా తమ వ్యాపారం, వ్యవసాయాన్ని యథావిధిగా సాగిస్తూనే దేవస్థానానికి కట్టాల్సిన బకాయిలను కట్టకుండా తప్పించుకుంటున్నారన్న విమర్శలు వినిపిస్తున్నాయి. ఏదైనా విషయం బయటపడి దేవస్థాన అధికారులు నిలదీస్తే తమ పలుకుబడిని ఉపయోగించి, ప్రజా ప్రతినిధుల ద్వారా ఫోన్లు చేయించి తమకు ఇబ్బంది లేకుండా చేసుకుంటున్నారు. ముఖ్యంగా పదేళ్లుగా వైసీపీ నాయకులతో అంటకాగుతూ కొంతమంది లీజు, కౌలుదారులు తమ ఇష్టారాజ్యంగా వ్యవహరించాన్నది స్థానికుల అభిప్రాయం. ఈ కారణంగానే దేవస్థానానికి సంబంధించిన వివిధ రకాల బకాయిలు ఏళ్లుగా పేరుకుపోయాయన్న విమర్శలు ఉన్నాయి. ఇప్పటికైనా అధికారులు రాజకీయ ఒత్తిళ్లకు లొంగకుండా బకాయిలను సాధ్యమైనంత త్వరగా వసూలు చేస్తే బాగుంటుందన్న మహాదేవుని భక్తుల నుంచి వినిపిస్తున్న అభిప్రాయం.

ఒక్క రోజులోనే పంపిణీ పూర్తి కావాలి

పింఛన్లపై కలెక్టర్ డా.కె. శ్రీనివాసులు



సమీక్ష నిర్వహించిన కలెక్టర్ డా.కె. శ్రీనివాసులు

నంద్యాల (కల్చరల్), జూన్ 29: ఎన్టీఆర్ భరోసా పింఛన్లను లబ్ధిదారులందరికీ జూలై 1వ తేదీ సాయంత్రం 6గంటలకు వంద శాతం పింఛన్ల పంపిణీ పూర్తి కావాలని కలెక్టర్ డా.కె. శ్రీనివాసులు సంబంధిత అధికారులను ఆదేశించారు. శనివారం కలెక్టరేట్‌లోని వీడియో కాన్ఫరెన్స్ ద్వారా ఎన్టీఆర్ భరోసా పింఛన్ల పంపిణీపై సంబంధిత అధికారులతో సమీక్ష నిర్వహించారు. డీఆర్డీఏ పీడీ శ్రీధర్‌రెడ్డి, జిల్లా పరిషత్ డిప్యూటీ సీఈఓ సుబ్బారెడ్డి తదితరులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా కలెక్టర్ డా.కె. శ్రీనివాసులు మాట్లాడుతూ ఎన్టీఆర్ భరోసా పింఛన్ల పంపిణీ కార్యక్రమాన్ని ప్రభుత్వం అత్యంత ప్రతిష్ఠాత్మకంగా జూలై 1వ తేదీన సాయంత్రానికి పూర్తి చేయాలన్నారు. రెండో తేదీకి పెండింగ్ ఉంటే సంబంధిత అధికారులపై చర్యలు తప్పవని కలెక్టర్ హెచ్చరించారు. ఈ మేరకు బ్యాంకుల నుంచి పింఛన్ డబ్బులను డ్రా చేసుకొని పంపిణీకి సిద్ధంగా ఉంచుకోవాలన్నారు. పింఛన్‌తోపాటు సీఎం లేఖను కూడా లబ్ధిదారులకు అందజేయాలన్నారు. ఇందులో ఏమాత్రం నిర్లక్ష్యం వహించిన, పొరపాట్లు జరిగినా సంబంధిత సిబ్బందిపై కఠిన చర్యలు తప్పవని కలెక్టర్ హెచ్చరించారు. పింఛన్ల పంపిణీకి సచివాలయ ఉద్యోగులతోపాటు మండల సర్వేయర్లు, బిల్ కలెక్టర్లు, జూనియర్ అసిస్టెంట్లు, ఆర్ఐ, తదితర సిబ్బందిని నియమించామన్నారు. బ్యాంకుల నుంచి నగదును తీసుకునేటప్పుడు తగినంత పోలీసు బందోబస్తు ఏర్పాటు చేసుకోవాలని సూచించారు. బయోమెట్రిక్ డివైస్‌లో ఏమైనా సమస్యలు ఉంటే వెంటనే జిల్లా కేంద్రానికి తెలియజేసి సమస్యను పరిష్కరించుకోవాలన్నారు. వీడియో కాన్ఫరెన్స్‌కు గైర్హాజరైనా, ముందస్తు అనుమతి లేకుండా సెలవులో వెళ్లినా కొత్తపల్లి, కొలిమిగుండ్ల ఎంపీడీవోలకు షోకాజు నోటీసు జారీ చేయాలని జిల్లా పరిషత్ డిప్యూటీ సీఈఓ సుబ్బారెడ్డిని ఆదేశించారు. ఈ వీడియో కాన్ఫరెన్స్‌లో డీపీవో మంజులవాణి, డీఎల్డీఓ కళ్యాణి, మున్సిపల్ కమిషనర్లు, ఎంపీడీఓలు, తహసీల్దార్లు, సంబంధిత అధికారులు పాల్గొన్నారు.

సభ్యులు వెళ్లిపోవడం సభా మర్యాద కాదు

- ఓ దళిత ఎమ్మెల్యేను అవమానించడమే
- గైర్హాజరైన అధికారులకు నోటీసులు జారీ చేయండి
- కౌన్సిల్ సమావేశంలో ఎమ్మెల్యే గిత్తా జయసూర్య



సమావేశంలో నుంచి వెళ్లిపోతున్న వైసీపీ చైర్మన్, కౌన్సిలర్లు

నందికొట్కూరు, జూన్ 29: సమావేశం జరుగు తుండగామనే చైర్మన్, కౌన్సిల్ సభ్యులు మధ్యలోనే వెళ్లిపోవడ మంటే ఓ దళిత ప్రజాప్ర తినిధిని అవమానించడమేనని నందికొట్కూరు ఎమ్మెల్యే గిత్తా జయసూర్య అన్నారు. శనివారం నందికొట్కూరు పట్టణంలోని జైకిసాన్ పార్కులో కౌన్సిల్ సమావేశం నిర్వహించారు. నందికొట్కూరు ఎమ్మెల్యేగా గిత్తా జయసూర్య ఎన్నికైన తర్వాత మొదటిసారి నందికొట్కూరు పట్టణ కౌన్సిల్ సమావేశానికి హాజరయ్యారు. ముందుగా డా.బీఆర్.అంబేడ్కర్, మహాత్మాగాంధీ, జివ్వాజి సుంకన్న గౌడ్‌ల విగ్రహాలకు పూలమాల వేసి నివాళి అర్పించారు. అనంతరం జైకిసాన్ పార్కులో జరిగే కౌన్సిల్ సమావేశానికి టీడీపీ కార్యకర్తలు, నాయకులతో ఆయన హాజరయ్యారు. చైర్మన్ దాసి సుధాకర్‌రెడ్డి, ఇతర కౌన్సిల్ సభ్యులు హాజరయ్యారు. ఎజెండా కాపీని మున్సిపల్ అధికారులు చదివి వినించారు. అనంతరం టేబుల్ ఐటమ్‌గా 25వ వార్డులో చేపట్టబోయే పనులను కమిషనర్ సుధాకర్‌రెడ్డి చదివారు. ఈ క్రమంలో చైర్మన్ దృష్టికి తేకుండా ఎలా టేబుల్ ఐటమ్ పెడతారని చైర్మన్ దాసి సుధాకర్‌రెడ్డి ప్రశ్నించారు. అనంతరం ఆయన సమావేశం నుంచి తన చాంబర్‌కు వెళ్లిపోయారు. ఆయనతోపాటు వైసీపీకి చెందిన కౌన్సిలర్లు కూడా బయటకు వెళ్లిపోయారు. ఈ తరుణంలో ఎమ్మెల్యే మాట్లాడుతూ సభ జరుగుతుండగా మధ్యలోనే వెళ్లిపోవడం సభా మర్యాద అనిపించుకోదని, ఓ దళిత ఎమ్మెల్యేను అవమానించడమే అవుతుందన్నారు. అనంతరం ఆయన అధికారులతో మాట్లాడుతూ 2021 నుంచి 24 వరకు మున్సిపాల్టీకి వచ్చిన ఆదాయం ఎంత? ఎంత ఖర్చు చేశారన్న వివరాలను తనకు తెలియజేయాలన్నారు. మున్సిపాల్టీలో ఎంత మంది సిబ్బంది పని చేస్తున్నారన్న వివరాలను సంబంధిత అధికారులు త్వరలో నిర్వహించబోయే రివ్యూ సమావేశం నాటికి అందజేయాలని ఆయన కోరారు. రెవెన్యూ, హెల్త్ శాఖలకు చెందిన అధికారులు ఎందుకు గైర్హాజరయ్యారో నోటీసులు ఇచ్చి వివరణ కోరాలని ఎమ్మెల్యే కమిషనర్‌కు సూచించారు.



సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే గిత్తా జయసూర్య

మహానందిలో మళ్లీ చిరుత

- భయాందోళనలో భక్తులు
- పట్టించుకోని అటవీశాఖ అధికారులు

మహానంది, జూన్ 29: మహానంది ఆలయ పరిసరాల్లో శనివారం తెల్లవారుజామున మరోసారి చిరుత పులి కనిపించడంతో స్థానికులు, భక్తులు భయాందోళన చెందారు. నల్లమలకు అత్యంత సమీపంలో దేవస్థానం గోశాల ఉండటంతో చిరుతపులి ఆవుల కోసం వచ్చి వుండవచ్చని గోశాల సంరక్షకులు అనుమానిస్తున్నారు. ఆ ప్రాంతంలో ఏర్పాటు చేసిన సీసీ పుటేజీలో చిరుతపులి కనిపించినట్లు అధికారులు తెలిపారు. ఇటీవల గోవులు బయటికి కనిపించకుండా గ్రీన్ మ్యాట్ ఏర్పాటు చేసినా కూడా చిరుతపులి రావడం ఆందోళన కలిగిస్తోంది. ఈనెల 26వతేది అర్ధరాత్రి ఇదే గోశాల వద్దకు చిరుతపులి వచ్చింది. మరోసారి చిరుత సంచారంతో భక్తులు ఆందోళన చెందుతున్నారు. అటవీశాఖ అధికారులు చిరుతను బంధించి జూకు తరలించాలని కోరుతున్నారు.



గోశాల పరిసరాల్లో చిరుతపులి సంచారం

ఫారెస్టు భూముల పరిశీలన



పొలాలను పరిశీలిస్తున్న అధికారులు

ఓర్వకల్లు, జూన్ 29: మండలంలోని శకునాల గ్రామ సమీపాన ఉన్న సోలార్ గ్రీన్‌కో సమీపంలోని ఫారెస్టు భూములను శనివారం రెవెన్యూ, అటవీ శాఖ, సోలార్ అధికారులు పర్యవేక్షించారు. గత రెండు రోజుల క్రితం సోలార్ పార్కులో ఫారెస్టు భూమి ఆక్రమిం చుకుని హైడర్ ప్రాజెక్టు నిర్మించారనే వార్తలు రావడంతో స్పందించిన డిప్యూటీ సీఎం పవన్ కళ్యాణ్ ఆదేశాల మేరకు సర్వే ఏడీఏ మునికన్నా, ఆర్డీవో శేషిరెడ్డి, తహసీల్దార్ నటరాజు, డీఎఫ్‌వో శ్యామల, డీఐ, విజయసారధి, డీఐవోఎస్ సుబ్బారెడ్డి, ఓర్వకల్లు సర్వేయర్ జయరా ముడు, ఫారెస్టు అధికారులు, సర్వేయర్లు ఫారెస్టు భూములను గుర్తించేందుకు సర్వేలు చేపట్టారు. సర్వే అనంతరం నివేదికను ప్రభుత్వానికి పంపనున్నట్లు అధికారులు తెలిపారు. నంద్యాల జిల్లాలోని గడివేముల పాణ్యం మండలం ఓర్వక ల్లు ప్రాంతాల్లో ఫారెస్టు భూమిని ఆక్రమించారని, ప్రభుత్వం నుంచి ఆదేశాలు రావడంతో ఈ పరిసర ప్రాంతాల్లో ఆయా శాఖ అధికారులు సర్వే పనులు చేపట్టారు. ఈ కార్యక్రమంలో గ్రీన్-కో అధికారి నాయుడు, సిబ్బంది ఉన్నారు.

జిల్లా సమగ్రాభివృద్ధికి చర్యలు

- ప్రకృతి సంపదను కొల్లగొట్టారు
- వ్యవస్థలన్నీ నిర్వీర్యం
- విజిలెన్స్ అండ్ ఎన్‌ఫోర్స్‌మెంట్ కమిటీలతో విచారణ చేపడతాం
- జిల్లాలో సాగు, తాగునీటికి ప్రాధాన్యం
- రాష్ట్ర మంత్రులు ఫరూక్, బీసీ జనార్దనరెడ్డి



సమావేశంలో మాట్లాడుతున్న మంత్రులు ఫరూక్, బీసీ

నంద్యాల (నూనెపల్లె), జూన్ 29: జిల్లా సమగ్రాభివృద్ధికి చర్యలు చేపట్టనున్నట్లు రాష్ట్ర మంత్రులు ఎన్ఎండీ ఫరూక్, బీసీ జనార్దనరెడ్డి అన్నారు. శనివారం నంద్యాలలోని టీడీపీ జిల్లా కార్యాలయంలో ఆ పార్టీ జిల్లా అధ్యక్షుడు మల్లెల రాజశేఖర్ అధ్యక్షతన సమావేశం నిర్వహించారు. రాష్ట్ర మంత్రులు ఎన్ఎండీ ఫరూక్, బీసీ జనార్దనరెడ్డిలతోపాటు జిల్లాలోని ఎమ్మెల్యేలు కోట్ల విజయ భాస్కరరెడ్డి, బుడ్డా రాజశేఖరరెడ్డి, గౌరు చరితారెడ్డి, భూమా అఖిలప్రియ, నందికొట్కూరు అసెంబ్లీ ఇన్‌చార్జి గౌరు వెంకటరెడ్డి హాజరయ్యారు. ఎన్టీఆర్ కాంస్య విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా మంత్రులు ఫరూక్, బీసీ మాట్లాడుతూ వైసీపీ పాలనలో అభివృద్ధి కుంటుపడిందని అన్నారు. తాము సమష్టి కృషితో జిల్లాను అన్ని రంగాల్లో ముందుకు తీసుకెళ్లేందుకు కృషి చేస్తామని అన్నారు. ప్రజలకు ఇచ్చిన హామీల మేరకు ప్రభుత్వం అడుగులు వేస్తోందని చెప్పారు. జిల్లాలో 2,21,240 మంది పింఛన్‌దారులకు జూలై 1వ తేదీన ఇంటి వద్దనే పింఛన్ పంపిణీ చేయనున్నట్లు తెలిపారు. అక్రమ మైనింగ్, ఇసుక రవాణా మొదలైన వాటిపై సమగ్ర విచారణ జరిపించి చర్యలు చేపడతామన్నారు. టీడీపీ నాయకులు, కార్యకర్తలపై వేల సంఖ్యలో అక్రమ కేసులు బనాయించారని, వాటిపై ప్రత్యేక కమిటీతో విచారణ చేపట్టి వైసీపీ హయాంలోని పోలీసు అధికారులపై చట్ట పరంగా చర్యలు తీసుకుంటామని అన్నారు. డోన్ ఎమ్మెల్యే కోట్ల సూర్య ప్రకాష్‌రెడ్డి మాట్లాడుతూ గుండ్రేవుల, వేదవతి, ఎల్లెల్సీ, ఆర్డీఎస్ ప్రాజెక్టుల పనులు పూర్తి చేస్తామన్నారు.

అవ్వా తాతలకు రూ.7,000



- 1 నుంచి రూ.4 వేల పింఛన్
- ఏప్రిల్ నుంచి పెంచుతామని హామీ
- మూడు నెలల బకాయి రూ.3 వేలు
- జిల్లాలో 2.45 లక్షల మందికి రూ.93.82 కోట్ల లబ్ధి
- బ్యాంకుల నుంచి రూ.167 కోట్లు డ్రా చేసిన సచివాలయ ఉద్యోగులు
- తొలి రోజే వంద శాతం పంపిణీకి సన్నాహాలు

కర్నూలు, జూన్ 29 (ఆంధ్రజ్యోతి): చంద్రబాబు నాయుడు ఈ నెల 13న సీఎంగా బాధ్యతలు చేపట్టిన తక్షణమే అవ్వాతాతల పింఛన్ రూ.4 వేలకు పెంచుతూ మూడో సంతకం చేశారు. దీనికి ఇటీవల మంత్రివర్గం సమావేశమై ఆమోద ముద్ర వేసింది. గత వైసీపీ ప్రభుత్వం సాగించిన ఆర్థిక విధ్వంసం కారణంగా ప్రభుత్వం ఆర్థిక సంక్షోభంలో కూరుకుపోయిన పరిస్థితుల్లో పెంచిన పింఛన్ రూ.4 వేలు, ఏప్రిల్ నుంచి అమల్లోకి రావడంతో బకాయి రూ.3 వేలు కలిపి రూ.7 వేలు జూలై ఒకటో తారీఖున ఎలా పంపిణీ చేస్తారనే ప్రశ్న వినిపిస్తోంది. అయితే చంద్రబాబు తన పాలన అనుభవంతో ఎలాంటి ఇబ్బందులు లేకుండా అవ్వాతాతలకు రూ.7 వేలు పంపిణీ చేసేందుకు సర్వం సిద్ధం చేశారు. జిల్లాలో 2.45 లక్షల మంది పింఛన్‌దారులకు పంపిణీ చేసేందుకు రూ.176.35 కోట్లు సచివాలయ సిబ్బంది వివిధ బ్యాంకుల నుంచి శనివారం డ్రా చేసుకున్నారు. ఒకటో తారీఖు సోమవారం ఉదయం 6 గంటల నుంచి పంపిణీ చేసేందుకు ఎలాంటి ఇబ్బందులు లేకుండా కలెక్టరు పి. రంజిత్‌బాషా, డీఆర్‌డీఏ పీడీ సలీంబాషా ఏర్పాట్లు చేశారు.

అవ్వాతాతల్లో ఆనందం

వృద్ధులు, వికలాంగులు, వితంతువులకు సామాజిక భద్రత కల్పించాలనే సంకల్పంతో 1983లో వృద్ధాప్య పంఛన్ పథకానికి ఆనాటి ముఖ్యమంత్రి ఎన్టీఆర్ దేశంలోనే మొదటిసారి శ్రీకారం చుట్టారు. రాష్ట్ర విభజన తరువాత 2014లో అప్పటి ముఖ్యమంత్రి చంద్రబాబు రూ.200 పింఛన్‌ను రూ1,000కు, 2019 జనవరిలో రూ.వెయ్యి నుంచి రూ.2 వేలకు పెంచారు. తాజాగా రూ.4 వేలకు పెంచడమే కాకుండా.. ఏప్రిల్ నుంచి అమలు చేస్తానని ఎన్నికల్లో ఇచ్చిన హామీ ప్రకారం బకాయి రూ.3 వేలుతో కలపి రూ.7 వేలు జూలై ఒకటో తారీఖున ఇచ్చేందుకు టీడీపీ కూటమి ప్రభుత్వం ఏర్పాట్లు చేసింది. జిల్లాలో 3,750 సచివాలయాల పరిధిలో వివిధ క్యాటగిరీల కింద 2.45 లక్షల మంది పింఛన్ లబ్ధిదారులకు పంపిణీ చేసేందుకు రూ.167.35 కోట్లు సచివాలయ సిబ్బంది బ్యాంకుల నుంచి డ్రా చేశారు. ఉదయం 6 గంటల నుంచి ప్రతి సచివాలయ సిబ్బంది 50 మందికి తగ్గకుండా పంపిణీ చేసేలా ఏర్పాట్లు చేశారు. వంద శాతం పంపిణీ చేయాలని కలెక్టరు రంజిత్‌బాషా మండలాల ఎంపీడీఓలకు ఆదేశాలు జారీ చేశారు. రూ.7 వేలు పింఛన్‌తో పాటు ధృవపత్రం, సీఎం చంద్రబాబు లేఖ అందజేయాలి. అదే క్రమంలో పింఛన్ ముట్టినట్లు రసీదు కూడా తీసుకోవాలని ఆదేశాలు జారీ చేశారు. జూన్ ఒకటో తారీఖున రూ.3 వేల ప్రకారం రూ.73.53 కోట్లు పంపిణీ చేశారు. జూలై ఒకటిన బకాయితో కలిపి రూ.7 వేలు చొప్పున జిల్లాలో ఉన్న 2.45 లక్షల మందికి రూ.167.35 కోట్లు పంపిణీ చేయబోతున్నారు. అంటే.. గత నెలతో పోలిస్తే రూ.93.82 కోట్లు అవ్వాతాతలు అదనపు ఆర్థిక లబ్ది పొందనున్నారు.

జిల్లాలో లబ్ధి పొందనున్న సామాజిక పింఛన్‌దారులు, పంపిణీ చేసే నగదు రూ. కోట్లల్లో

పింఛదారులు	లబ్ధిదారులు	నగదు మొత్తం
వృద్ధులు	1,25,845	88.09
వితంతువులు	71,498	50.05
దివ్యాంగులు	31,434	18.86
చేనేత కార్మికులు	2,945	2.06
కల్లుగీత కార్మికులు	242	0.17
హిజ్రాలు	241	0.17
ఒంటరి మహిళలు	5,881	4.12
మత్స్యకార్మికులు	817	0.57
డప్పు కళాకారులు	1,456	1.02
చర్మకారులు	1,141	0.80
అభయహస్తం	2,559	0.13
ఇతరులు	1,172	1.28
మొత్తం	**2,45,229**	**167.35**

టిడ్కో ఇళ్ల పంపిణీ పట్టించుకోని వైసీపీ

- నగరాన్ని అన్ని విధాలుగా అభివృద్ధి చేస్తా
- మంత్రి టీజీ భరత్



సమీక్ష సమావేశంలో మంత్రి టీజీ భరత్

కర్నూలు(న్యూసిటీ), జూన్ 29: రాష్ట్ర వ్యాప్తంగా టిడ్కో ఇళ్ల పంపిణీని గత గత వైసీపీ ప్రభుత్వం పట్టించుకోకుండా కాలయాపన చేసిందని రాష్ట్ర పరిశ్రమలు, వాణిజ్యం, ఆహారశుద్ధి శాఖ మంత్రి టీజీ భరత్ అన్నారు. శనివారం కర్నూలు అసెంబ్లీ నియోజకవర్గానికి సంబంధించి టిడ్కో, పారిశుధ్య విభాగం అధికారులతో ప్రభుత్వ అతిథి గృహంలో సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా మంత్రి టీజీ భరత్ మాట్లాడుతూ టిడ్కో ఇళ్లను గత తెలుగుదేశం ప్రభుత్వం ప్రతిష్ఠాత్మకంగా చేపట్టిందని, ఆ తర్వాత వచ్చిన వైసీపీ ప్రభుత్వం ఐదేళ్లపాటు టిడ్కో ఇళ్లను గాలికి వదిలేసిందన్నారు. ప్రస్తుతం కర్నూలు అసెంబ్లీ నియోజకవర్గంలో వార్డుల వారిగా టిడ్కో లబ్ధిదారుల వివరాలు అందజేయాలని మంత్రి అధికారులను ఆదేశించారు. నివేదికల ఆధారంగా టిడ్కో ఇళ్ల పంపిణీని పరిశీలిస్తామని అన్నారు. నగరంలో పారిశుధ్యం మెరుగుపడాలంటే కార్మికుల సంఖ్య కొరతగా ఉన్నట్లు తన దృష్టికి వచ్చిందని మంత్రి తెలిపారు. కార్మికుల సంఖ్య పెంచేందుకు కృషి చేస్తానని అన్నారు. ఈ సమావేశంలో టిడ్కో ఎస్ఈ రాజశేఖర్, మెడికల్ హెల్త్ ఆఫీసర్ కే. విశ్వేశ్వరరెడ్డి, శానిటరీ సూపర్‌వైజర్ నాగరాజు, శానిటరీ ఇన్‌స్పెక్టర్లు పాల్గొన్నారు.

సచివాలయం ఉద్యోగికి షోకాజ్ నోటీసు

ఆంధ్రజ్యోతి ఎఫెక్ట్

కోడుమూరు, జూన్ 29: పట్టణంలోని సచివాలయం ఉద్యోగి డిజిటల్ అసిస్టెంట్‌కు రమేష్‌కు ఎట్టకేలకు షోకాజ్ నోటీసును అందజేశారు. ఈ నెల 28న ఇష్టారాజ్యం, విధుల్లో నిర్లక్ష్యం అనే శీర్షికతో కథనం ప్రచురితం అయింది. ఇందుకు ఎంపీడీవో దివ్య స్పందిస్తూ షోకాజ్ నోటీసులు జారీ చేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ విధుల్లో నిర్లక్ష్యం వహిస్తే సహించేది లేదని హెచ్చరించారు. సమయపాలన పాటించి సచివాలయం ఉద్యోగస్తులు ప్రజలకు అందుబాటులో ఉండి సేవలు అందించాలన్నారు.

గురుకుల విద్యార్థులకు 2, 3 తేదీల్లో కౌన్సెలింగ్

పాణ్యం, జూన్ 29 : మహాత్మ జ్యోతిబాపూలే బీసీ సంక్షేమ గురుకుల పాఠశాలలో ప్రవేశ పరీక్ష మెరిట్ విద్యార్థులకు జూలై 2, 3 తేదీలలో కౌన్సెలింగ్ నిర్వహిస్తున్నట్లు జిల్లా కన్వీనర్ ఫ్లోరమ్మ తెలిపారు. శనివారం ఆమె మాట్లాడుతూ కర్నూలు, నంద్యాల జిల్లాలో నిర్వహించిన ప్రవేశ పరీక్షలో ఉత్తీర్ణులైన అభ్యర్థులు బాలురకు 2వ తేదీన, బాలికలకు 3వ తేదీన నెరవాడ జూనియర్ కళాశాలలో ఉదయం 10 గంటలకు కౌన్సెలింగ్ ఉంటుందని తెలిపారు. ఉమ్మడి జిల్లాల గురుకుల పాఠశాలల ప్రిన్సిపాల్స్, కన్వీనర్ ఆధ్వర్యంలో మెరిట్, కులాల ఆధారంగా సీట్ల భర్తీ 1:2 నిష్పత్తిలో కౌన్సెలింగ్ జరుగుతుందన్నారు.

కొత్తపల్లి కానిస్టేబుల్ సస్పెన్షన్

కొత్తపల్లి, జూన్ 29: కొత్తపల్లి పోలీస్‌స్టేషన్‌లో విధులు నిర్వహిస్తున్న సి.విష్ణువర్ధన్ రెడ్డి అనే కానిస్టేబుల్‌ను ఎస్పీ రఘువీర్ రెడ్డి శనివారం సస్పెండ్ చేసినట్లు కొత్తపల్లి ఎస్ఐ హరిప్రసాద్ తెలిపారు. కానిస్టేబుల్ విష్ణువర్ధన్ రెడ్డి కొత్తపల్లి, పాములపాడు, ఆత్మకూరు మండలాల్లో విధుల్లో ఉండి మద్యం తాగడంతోపాటు చట్ట వ్యతిరేక కార్యకలాపాలకు పాల్పడినట్లు తెలిపారు. కొత్తపల్లి మండల ప్రజలను నానా దుర్భాషలాడుతూ భయభ్రాంతులకు గురి చేసినట్లు ఫిర్యాదులు అందాయని చెప్పారు. అంతేగాకుండా గత ఎన్నికల సమయంలో ఎజలకు సేవలు అందించకపోవడం, దురుసుగా మాట్లాడడం తదితర కారణాల వల్ల ఎస్పీ దృష్టికి వెళ్లడంతో కానిస్టేబుల్‌ను సస్పెండ్ చేసినట్లు ఎస్ఐ తెలిపారు.

ప్రొవిజనల్ మెరిట్ లిస్టు విడుదల

కర్నూలు(హాస్పిటల్), జూన్ 29: ఉమ్మడి కర్నూలు జిల్లాలోని గవర్నమెంట్ మెడికల్ కాలేజీ, జనరల్ హాస్పిటల్, గవర్నమెంటు నర్సింగ్ కాలేజీలకు సంబంధించిన 30 కేటగిరీల అభ్యర్థుల మెరిట్ లిస్టు కర్నూలు, నంద్యాల జిల్లాల ప్రభుత్వ వెబ్‌సైట్ కర్నూలు మెడికల్ కాలేజీ వెబ్‌సైట్‌లో అప్‌లోడు చేసినట్లు ప్రిన్సిపాల్ డా. చిట్టినరసమ్మ శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. Https://kurnool.ap.gov.in, https://nandyal.ap.gov.in, https://kurnool medicalcollege.ac.in వెబ్‌సైట్‌లలో అప్‌లోడ్ చేసినట్లు వెల్లడించారు. అభ్యర్థులు తమ మెరిట్ వివరాలు సరి చూసుకుని అభ్యంతరాలు ఏమైనా ఉంటే జూలై 1 నుంచి 5వ తేదీ సాయంత్రం 5 గంటలలోపు ప్రిన్సిపాల్ కార్యాలయంలో సంప్రదించాలన్నారు.

1 నుంచి 10 వరకు టీచ్ టూల్ శిక్షణ

కర్నూలు(ఎడ్యుకేషన్), జూన్ 29: జూలై 1వ తేదీ నుంచి 10వ తేదీ వరకు టీచ్ టూల్ శిక్షణ కార్యక్రమం జిల్లాలోని నాలుగు కేంద్రాల్లో జరుగుతుందని జిల్లా విద్యాశాఖ అధికారి శామూయేల్ శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. ఆదోని ప్రభుత్వ బాలికల పాఠశాల, పత్తికొండ ప్రభుత్వ బాలురు, ఎమ్మిగనూరు జిల్లా పరిషత్ హైస్కూల్ (బాలికలు), పెద్దపాడు, కల్లూరు మండలం కర్నూలు ఏపీ మోడల్ స్కూల్‌లో ఈ శిక్షణా కార్యక్రమం ప్రతి రోజు ఉదయం 9.30 గంటల నుంచి సాయంత్రం 5.30 గంటల వరకు జరుగుతుందన్నారు. ఈ శిక్షణ కార్యక్రమంలో మొత్తం 492 మంది పాల్గొంటారన్నారు.

రోడ్డు ప్రమాదంలో వ్యక్తి మృతి

చాగలమర్రి, జూన్ 29: నంద్యాల జిల్లా చాగలమర్రి గ్రామానికి చెందిన అబ్దుల్లా(35) రోడ్డు ప్రమాదంలో మృతి చెందాడు. హీరో షోరూమ్‌లో ప్రైవేటు ఉద్యోగిగా విధులు నిర్వహిస్తున్న అబ్దుల్లా దువ్వూరు నుంచి చాగలమర్రికి వస్తుండగా శుక్రవారం మధ్యాహ్నం దువ్వూరు మండలం జిల్లెల్ల గ్రామం వద్ద డివైడర్ ఢీకొనడంతో తీవ్ర గాయాలయ్యాయి. ప్రొద్దుటూరు వైద్యశాలలో చికిత్స పొందుతూ కోలుకోలేక శనివారం తెల్లవారుజామున మృతి చెందాడు. పోలీసులు మృతదేహానికి పోస్టుమార్టం చేయించారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు. మృతుడికి భార్య, ముగ్గురు సంతానం ఉన్నారు.

లారీ, బొలేరో వాహనం ఢీ

ఒకరు మృతి.. ఐదుగురికి గాయాలు, మరొకరి పరిస్థితి విషమం

మంత్రాలయం, జూన్ 29: మంత్రాలయం మండలంలోని కల్లుదేవకుంట సమీపంలో బొలేరో వాహనం, మినీ లారీ ఢీకొని ఒకరు మృతి చెందగా.. ఐదు మందికి గాయాలయ్యాయి. ఒకరి పరిస్థితి విషమంగా ఉంది. ఈ రోడ్డు ప్రమాదం శనివారం తెల్లవారుజామున జరిగింది. మంత్రాలయం ఎస్ఐ గోపినాథ్ తెలిపిన వివరాల మేరకు కర్ణాటకలోని సిరా తాలుకా జంజిరామనహల్లి గ్రామానికి చెందిన పది మంది కుటుంబ సభ్యులు బొలేరో వాహనంలో రాఘవేంద్రస్వామి దర్శనానికి బయలుదేరారు. మంత్రాలయం మండలం కల్లుదేవకుంట వద్ద బొలేరోకు మహారాష్ట్రలోని లాతూరు జిల్లా హంస గ్రామానికి చెందిన అవినాశ్ డీసీఎం మినీ లారీని డ్రైవ్ చేస్తూ వచ్చి ఢీకొట్టాడు. అవినాశ్ గుల్బర్గా నుంచి చింతామణి వెళ్తుండగా ఈ ప్రమాదం చోటు చేసుకుంది. ఈ ఘటనలో బొలేరో డ్రైవర్ హనుమంతరాజు, లారీ డ్రైవర్ అవినాశ్‌కు తీవ్ర గాయాలయ్యాయి. బొలేరో వాహనంలో ఉన్న రమ్య, శృతి, చరణ్, మంజునాథ్‌లకు గాయాలయ్యాయి. మంత్రాలయం ఎస్ఐ గోపినాథ్ సంఘటనా స్థలానికి చేరుకుని పరిశీలించారు. బొలేరో డ్రైవర్ హనుమంతరాజు (29) బెంగుళూరు ఆసుపత్రిలో చికిత్స పొందుతూ సాయంత్రం మృతి చెందాడు. గాయపడిన మిగతా వారు ఎమ్మిగనూరు ఆసుపత్రిలో చికిత్స పొందారు. కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నారు.

చికిత్స పొందుతూ వ్యక్తి మృతి

సంజామల, జూన్ 29 : విద్యుత్ ప్రమాదానికి గురైన వ్యక్తి చికిత్స పొందుతూ మృతి చెందాడు. ఈ సంఘటన మండలంలోని ఆకుమళ్లలో చోటుచేసుకుంది. ఈ సంఘటనపై సంజామల పోలీస్ స్టేషన్‌లో కేసు నమోదైంది. ఆకుమళ్ల గ్రామానికి చెందిన షేక్ నబీరసూల్(55) గ్రామంలో ప్రైవేట్‌గా కరెంట్ పనులు చేసేవాడు. గ్రామానికి చెందిన రామయ్య వ్యవసాయ పొలంలో విద్యుత్ తీగలు సవరించేందుకు నబీరసూల్, రాజు, రామయ్య ముగ్గురు కలిసి ఈ నెల 22న పొలం దగ్గరికి వెళ్ళారు. రామయ్య పొలంలో ఉన్న ట్రాన్స్‌ఫార్మర్ ఎక్కి నబీరసూల్ విద్యుత్ తీగలు సవరిస్తుండగా ప్రమాదవశాత్తు జారి కింద పడ్డాడు. అతని తలకు బలమైన గాయం తగలడం వల్ల అపస్మారక స్థితికి చేరుకున్నాడు. చికిత్స కోసం అతడ్ని కోవెలకుంట్ల హాస్పిటల్‌కు తీసుకెళ్ళారు. అక్కడి నుంచి మెరుగైన వైద్యం కోసం నంద్యాల శాంతి రామ్ వైద్యశాలకు తరలించారు. అక్కడ వైద్యం పొందుతూ కోలుకోలేక నబీరసూల్ మృతి చెందినట్లు ఎస్ఐ రమేశ్‌రెడ్డి తెలిపారు. మృతుడికి భార్య, కొడుకు ఉన్నారు. కొడుకు బాషా ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు ఎస్సై తెలిపారు.

టన్నెల్ క్యాంపు వద్ద టిప్పర్ తగిలి రైతు మృతి

అవుకు, జూన్ 29 : నంద్యాల జిల్లా, అవుకు మండలం, మెట్టుపల్లె గ్రామ సమీపంలో నిర్మితమవుతున్న టన్నెల్ - 3 క్యాంపు కార్యాలయం వద్ద టిప్పర్ తగిలి కోనాపురం గ్రామానికి చెందిన రైతు పెద్ద మద్దిలేటి (62) శనివారం మృతి చెందాడు. రైతు పెద్దమద్దిలేటికి టన్నెల్ - 3 క్యాంపు కార్యాలయం సమీపంలో ఉన్న 5 ఎకరాలు పొలం ఉంది. ఉదయం పొలం సమీపంలోనే ఉన్న టన్నెల్ క్యాంపు కార్యాలయంలోనికి వెళ్లాడు. టన్నెల్‌కు సంబంధించిన టిప్పర్ రివర్స్‌లో వచ్చి పెద్దమద్దిలేటిని ఢీకొట్టడంతో తీవ్రంగా గాయపడ్డాడు. చికిత్స కోసం బనగానపల్లె ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. పరిస్థితి విషమంగా ఉండటంతో డాక్టర్లు కర్నూలుకు రెఫర్ చేశారు. కర్నూలుకు తరలిస్తుండగా మార్గమధ్యంలో మృతి చెందినట్లు కుటుంబ సభ్యులు తెలిపారు. మృతదేహాన్ని పోస్టమార్టం నిమిత్తం అవుకు ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. మృతునికి భార్య రామక్క, ముగ్గురు కొడుకులు, కుమార్తె ఉన్నారు. కుటుంబసభ్యులు పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేయనున్నట్లు తెలిపారు.

'నవోదయ' ఫలితాల్లో 'విశ్వం' ప్రభంజనం

తిరుపతి(విద్య), జూన్ 29: జాతీయస్థాయిలో జవహర్ నవోదయ విద్యాలయాల్లో 2024-25 విద్యాసంవత్సరానికి 11వ తరగతిలో ప్రవేశాలకోసం నిర్వహించిన పరీక్ష ఫలితాల్లో తిరుపతికి చెందిన విశ్వం విద్యార్థులు ప్రభంజనం సృష్టించారని ఆ స్కూల్ చైర్మన్, కోచింగ్ ఫెడరేషన్ ఆఫ్ ఇండియా రాష్ట్ర ఉపాధ్యక్షుడు డాక్టర్ ఎన్.విశ్వనాథరెడ్డి తెలిపారు. తమ విద్యార్థులు ఎం.యశ్వంత్, ఆర్.మహిత, ఎ.యుగంధర్, పి.సాత్విక, పి. లక్ష్మీనారాయణ.. సీట్లు సాధించారన్నారు. అలాగే ఈ విద్యా సంవత్సరంలో 6, 9 తరగతుల ప్రవేశ పరీక్ష ఫలితాల్లోనూ గంగాజైదీప్‌రెడ్డి, లాస్య, లిఖిత, ఉదయశ్రీ, లక్ష్మి, కేతన్ భాస్కర్, జ్యోత్స్న, గౌతమ్‌కుమార్, హేమంత్, కేథన్, హాసినిలతో పాటు మొత్తం 48మంది విద్యార్థులు సీట్లు సాధించి సత్తా చాటారని వివరించారు. ప్రతిభ చూపిన విద్యార్థులను కరస్పాండెంట్ ఎన్.తులసీవిశ్వనాథ్, అకడమిక్ డైరెక్టర్ ఎన్. విశ్వచందన్‌రెడ్డి, విశ్వశ్రీ, టీచర్లతో కలిసి అభినందించారు.

భ్రామరికి బంగారు హారం



బంగారు హారాన్ని సమర్పిస్తున్న దాత

శ్రీశైలం, జూన్ 29: శ్రీశైలం భ్రమరాంబికాదేవికి హైదరాబాద్‌కు చెందిన నూకల నటరాజ్ అనే భక్తుడు శనివారం కుటుంబ సమేతంగా వచ్చి లక్ష్మీకాసుల బంగారు హారాన్ని సమర్పించుకున్నారు. రూ. 24,41,433 విలువైన ఈ హారం 375 గ్రాముల 400 మిల్లీగ్రాములు ఉందని దాత తెలిపారు. అమ్మవారి ఆలయ ప్రాంగణంలోని ఆశీర్వచన మండపంలో దాతలు ఈ బంగారు హారాన్ని అమ్మవారి ఆలయ ప్రధానార్చకులు మార్కండేయస్వామి, ఆలయ సహాయ కార్యనిర్వహణాధికారి హరిదాసు, అమ్మవారి ఆలయ ఇన్‌స్పెక్టర్ రామనాయుడుకు అందజేశారు. దాతలకు వేదపండితులు వేదాశీర్వచనం పలికి తీర్థప్రసాదాలు, స్వామివారి శేషవస్త్రం అందజేశారు.

కలెక్టర్‌ను కలిసిన పాణ్యం ఎమ్మెల్యే



కలెక్టర్‌ను కలిసిన పాణ్యం ఎమ్మెల్యేలు

కల్లూరు, జూన్ 29: నూతన కలెక్టర్ పి. రంజిత్‌బాషాను పాణ్యం ఎమ్మెల్యే గౌరు చరిత మర్యాదపూర్వకంగా కలిశారు. శనివారం కలెక్టర్ చాంబర్‌లో గౌరు చరిత పుష్పగుచ్ఛం అందించి కలెక్టర్‌కు శుభాకాంక్షలు తెలిపారు. వైసీపీ పాలనలో నాయకులు రెవెన్యూ వ్యవస్థను భ్రష్టు పట్టించారని వ్యవస్థను గాడిలో పెట్టాలని ఆమె కోరారు. పాణ్యం నియోజకవర్గ అభివృద్ధికి సహకరించాలని గౌరు చరిత కలెక్టర్‌ను అభ్యర్థించారు. అలాగే నందికొట్కూరు ఎమ్మెల్యే గిత్తా జయసూర్య, నంద్యాల జిల్లా టీడీపీ అధ్యక్షుడు మల్లెల రాజశేఖర్ కూడా కలెక్టర్‌ను మర్యాదపూర్వకంగా కలిసి శుభాకాంక్షలు తెలిపారు.

రామచంద్రాపురంలో రెండు డయేరియా కేసులు

కోడుమూరు/కోడుమూరు(రూరల్) జూన్ 29: కోడుమూరు మండలం రామచంద్రాపురం (కొత్తూరు) గ్రామంలో రెండు డయేరియా కేసులు నమోదయ్యాయి. డీఎంఅండ్‌హెచ్‌వో ప్రవీణ్‌కుమార్ శనివారం గ్రామాన్ని సందర్శించి డయేరియా బారిన పడిన అక్కమ్మ, మధు ఇండ్లకు వెళ్లి వాళ్ల పరిస్థితిని పరిశీలించారు. బాధితులను కోడుమూరు సీహెచ్‌సీ ఆసుపత్రికి తరలించి మెరుగైన వైద్యం అందించాలని సిబ్బందిని ఆదేశించారు. అనంతరం గ్రామంలోని తాగునీటి కుంటను పరిశీలించారు. గ్రామ ప్రజలకు మంచినీటిని సరాఫరా చేయాలని ఆర్‌డబ్ల్యూఎస్ అధికారులను కోరారు. గ్రామ ప్రజలకు ఓఆర్ఎస్ ప్యాకెట్లను పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో డాక్టర్ షఫియాబేగం, హెచ్ఈ క్రిష్ణారెడ్డి, ఎంపీహెచ్ఈవో రామకృష్ణయ్య సిబ్బంది రాఘవయ్య, వెంకటేశ్వరమ్మ, సరస్వతి, కుమారి తదితరులు పాల్గొన్నారు.

ఉదయం నుంచే పింఛన్ పంపిణీ

రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి నీరబ్ కుమార్ ప్రసాద్

కర్నూలు(కలెక్టరేట్), జూన్ 29: ఎన్టీఆర్ భరోసా పింఛన్ పంపిణీ చేయడానికి నగదును బ్యాంకుల నుంచి విత్‌డ్రా చేసుకుని సిద్ధంగా ఉంచుకొని, జూలై 1వ తేదీన ఉదయం 6 గంటల నుంచే పంపిణీ ప్రారంభించాలని రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి నీరబ్ కుమార్ ప్రసాద్ జిల్లా కలెక్టర్లను ఆదేశించారు. శనివారం ఎన్టీఆర్ భరోసా పింఛన్ల పంపిణీపై కలెక్టర్లతో ఆయన వీడియో కాన్ఫరెన్స్ ద్వారా సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రధాన కార్యదర్శి మాట్లాడుతూ ఎన్టీఆర్ భరోసా పింఛన్ల పంపిణీకి ఎఫ్‌పీఎస్ బయోమెట్రిక్ యంత్రాలను కూడా సిద్ధంగా ఉంచుకోవాలన్నారు. పింఛన్ల పంపిణీ వ్యవస్థను పూర్తి స్థాయిలో మ్యాపింగ్ చేయాలన్నారు. దీని కోసం నూతనంగా రూపొందించిన పింఛన్ డిస్ట్రిబ్యూషన్ యాప్‌ను ఎంపీడీవోలు డౌన్‌లోడు చేసుకోవాలన్నారు. బ్యాంకుల బ్రాంచ్‌లకు నగదు విత్‌డ్రా చేసుకుని, పంపిణీ చేసే వరకు కలెక్టర్లు పరిశీలిస్తూ ఉండాలన్నారు. పింఛన్ల పంపిణీ సమయంలో ముఖ్యమంత్రి లేఖను కూడా లబ్ధిదారులను అందజేసేలా చర్యలు తీసుకోవాలన్నారు. జూలై 1వ తేదీ ఉదయం 6 గంటల నుంచి పంపిణీని ప్రారంభించి అదే రోజే పూర్తి చేయాలన్నారు. ఇందులో ఎటువంటి లోటుపాట్లు లేకుండా పంపిణీ ప్రక్రియను పూర్తి చేయాలని ఆయన ఆదేశించారు. కలెక్టర్ పి.రంజిత్‌బాషా మాట్లాడుతూ పింఛన్ల పంపిణీకి అవసరమైన రూ.167 కోట్ల నగదును డ్రా చేసుకొని పంపిణీకి సిద్ధంగా ఉంచుకున్నట్లు తెలిపారు. అనంతరం ఆయన అధికారులతో మాట్లాడుతూ పింఛన్ పంపిణీలో ప్రత్యేక శ్రద్ధ తీసుకోవాలని, వంద శాతం సజావుగా పూర్తి చేసేలా అన్ని ఏర్పాట్లు చేయాలని ఆదేశించారు. ఈ కాన్ఫరెన్స్‌లో జాయింట్ కలెక్టర్ నారపురెడ్డి మౌర్య, జడ్పీ సీఈవో నాసరరెడ్డి, డీఆర్‌డీఏ పీడీ సలీంబాషా, ఎల్డీఎం రామచంద్రరావు పాల్గొన్నారు.

1న ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదిక

- కలెక్టర్ రంజిత్‌బాషా

కర్నూలు(కలెక్టరేట్), జూన్ 29: కర్నూలు కలెక్టరేట్‌లోని సోమవారం సునయన ఆడిటోరియంలో ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదిక (పబ్లిక్ గ్రీవెన్స్ రెడ్రెస్సల్ సిస్టం) కార్యక్రమం ద్వారా ప్రజల నుంచి వినతులు స్వీకరిస్తున్నట్లు కలెక్టర్ రంజిత్‌బాషా శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. జిల్లా కేంద్రంతో పాటు అన్ని మండల కేంద్రాల్లో, మున్సిపల్ కార్యాలయాల్లో, డివిజన్ స్థాయిలో కూడా ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదిక కార్యక్రమం జరుగుతుందని తెలిపారు.

రోడ్డు ప్రమాదంలో వ్యక్తి మృతి

ప్యాపిలి, జూన్ 29: మండలంలోని వెంగళాంపల్లి సమీపంలో శనివారం జరిగిన రోడ్డు ప్రమాదంలో ధనుంజయ(30) అనే వ్యక్తి మృతి చెందాడు. గుత్తికి చెందిన ధనుంజయ ఆయన మిత్రుడు శివయ్య కలసి బైకుపై బేతంచెర్ల మండలంలోని మద్దిలేటిస్వామి పుణ్యక్షేత్రానికి వెళ్లారు. అక్కడ స్వామిని దర్శించుకొని తిరిగి వస్తుండగా వెంగళాంపల్లి సమీపంలో ఓ గుర్తు తెలియని వాహనం బైకును ఢీకొట్టింది. దీంతో ధనుంజయ అక్కడి కక్కడే మృతి చెందాడు. శివయ్యకు తీవ్ర గాయాలయ్యాయి. కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

కాంట్రాక్టర్ల జీవితాల్లో వెలుగులు నింపాలి



అహోబిలంలో పూజలు చేసిన రాష్ట్ర కాంట్రాక్టర్ల అసోసియేషన్ కార్యవర్గ సభ్యులు

ఆళ్లగడ్డ, జూన్ 29: రాష్ట్రంలోని కాంట్రాక్టర్ల జీవితాల్లో వెలుగులు నింపాలని కోరుతూ రాష్ట్ర కాంట్రాక్టర్ల అసోసియేషన్ అధ్యక్షుడు శెట్టి విజయ కుమార్ తన కార్యవర్గ సభ్యులతో అహోబిలం లక్ష్మీనరసింహస్వామికి శనివారం పూజలు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గత ప్రభుత్వంలో ఎన్నో నిర్మాణ పనులు చేసినా పైసా బిల్లులు అందలేదని అన్నారు. నూతన ప్రభుత్వంలోనైనా కాంట్రాక్టర్ల సమస్యలు తీరుతాయని ఆశాభావం వ్యక్తం చేశారు.

'పథకాలన్నీ రైతులకు అందాలి'

మిడుతూరు, జూన్ 29: ప్రభుత్వం నుంచి వచ్చే పథకాలన్నీ రైతులకు అందేలా చూడాలని ఏవో పీరు నాయక్ వ్యవసాయ సిబ్బందికి సూచించారు. మిడుతూరు రైతు సేవా కేంద్రంలో శనివారం వివిధ గ్రామాల ఏఈవో, ఎంపీఈవో, వీహెచ్ఏ, వీఏలతో ఏవో సమీక్ష సమావేశం నిర్వహించారు. ఏవో మాట్లాడుతూ ఖరీఫ్, రబీ సాగులో ప్రభుత్వం నుంచి రైతులకు కావాల్సిన విత్తనాలు, ఎరువులు, పురుగుల మందులు, వ్యవసాయ పనిముట్లు అందేలా చూడాలన్నారు. సబ్సిడీపై ఉల్లి విత్తనాలు ఎల్-883, అగ్రిఫౌండ్ డార్క్ రెడ్ అనే విత్తన రకాలు రైతు సేవా కేంద్రంలో అందుబాటులో ఉన్నాయని తెలిపారు. ఆయా గ్రామాల్లో రైతులకు కావాల్సిన విత్తనాలు, ఎరువులు తక్కువగా ఉంటే ముందుగానే ఇండెంట్ పెట్టుకోవాలని సిబ్బందికి సూచించారు. ప్రతి గ్రామంలో రైతుల దగ్గర వున్న ట్రాక్టర్, రొటావేటర్, స్ప్రేర్స్ వ్యసాయ పనిముట్ల వివరాలు సేకరించాలని తెలిపారు. గ్రామాల్లో రైతుల పొలాల్లో సేకరించిన సాయిల్ శాంపిళ్లను పూర్తి చేయాలని సిబ్బందికి సూచించారు.

పింఛన్ పంపిణీకి ప్రత్యేకాధికారుల నియామకం

పగిడ్యాల, జూన్ 29: మండలంలోని వివిధ గ్రామాల్లో జూలై 1వ తేదిన పంపిణీ చేయనున్న ఎన్టీఆర్ భరోసా పింఛన్ పంపిణీ కార్యక్రమానికి ప్రత్యేకాధికారులను నియమించినట్లు ఎంపీడీవో కవిరాజ్ తెలిపారు. కొత్త ముచ్చుమర్రి, పాత ముచ్చుమర్రి గ్రామాల సచివాలయాలకు వ్యవసాయాధికారి జ్యోతు కుమార్, పగిడ్యాల1, 2 సచివాలయాలకు ఎంపీడీవో కార్యాలయ సూపరిడెంట్ నాగరాజు, లక్ష్మాపురం-3, పగిడ్యాల-3 సచివాలయాలకు ఈవోఆర్డి నాగేంద్రమయ్య, లక్ష్మాపురం-1, లక్ష్మాపురం -2 సచివాలయాలకు పంచాయతీరాజ్ ఏఈ వెంకటేశ్వర్లు, నెహ్రూనగర్-1,2 సచివాలయాలకు ఎంఈవో సుభాన్‌లను నియమించినట్లు ఆయన తెలిపారు. ఆయా అధికారులకు కేటాయించిన గ్రామాలలో పింఛన్ పంపిణీ కార్యక్రమం సజావుగా జరిగేల పర్యవేక్షించాలని ఆదేశించారు.

ఘనంగా ఫేర్‌వెల్ డే

పాణ్యం, జూన్ 29: మండలంలోని శాంతిరాం ఫార్మసీ కళాశాలలో శనివారం ఫేర్‌వెల్ డే వేడుకలు ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా శాంతిరాం వైద్య కళాశాల ఆర్థో విభాగం హెచ్ఓడీ డాక్టర్ మహేంద్రారెడ్డి హాజరై మాట్లాడారు. ఫార్మా-డి కోర్సు పూర్తి చేసుకున్న విద్యార్థులకు అభినందనలు తెలిపారు. విద్యార్థులు సమాజసేవకు తమ విజ్ఞానాన్ని వినియోగించుకొని జీవితంలో మంచిగా స్థిరపడాలని కోరారు. విద్యార్థులు ప్రదర్శించిన సాంస్కృతిక ప్రదర్శనలు విశేషంగా ఆకట్టుకున్నాయి. కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ మధుసూదన్‌చెట్టి, డీన్ డాక్టర్ అశోక్‌కుమార్, ఫార్మా-డి విభాగం హెచ్ఓడీ డాక్టర్ యుగంధర్, విద్యార్థులు, అధ్యాపకులు పాల్గొన్నారు.

ఘనంగా తులసి రెడ్డి జన్మదిన వేడుకలు



తులసిరెడ్డికి శుభాకాంక్షలు చెబుతున్న జిల్లా గౌడ సంఘం నాయకులు

నంద్యాల (నూనెపల్లె), జూన్ 29: టీడీపీ రాష్ట్ర కార్యదర్శి ప్రముఖ న్యాయవాది తాతి రెడ్డి తులసి రెడ్డి జన్మదిన వేడుకలు శనివారం ఘనంగా నిర్వహించారు. టీడీపీ నాయకలు కార్యకర్తలు వివిధ విద్యార్థి యువజన ప్రజా, కుల సంఘాలనాయకులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు. కార్యాలయంలో కేక్ కట్ చేశారు.

మహానందిలో భక్తుడి మృతి

మహానంది, జూన్ 29: మహానంది క్షేత్రం పరిధిలోని సుపథ మంటపం వద్ద శనివారం తెల్లవారుజామున భక్తుడు మృతి చెందారు. చిత్తూరు జిల్లా పెద్ద మండెం మండలం వెలిగిలి గ్రామానికి చెందిన ముత్యాలరెడ్డి అనే భక్తుడు మహానంది దేవాలయానికి దర్శనం కోసం శుక్రవారం రాత్రి వచ్చారు. పరిసరాల్లోని సుపథ మంటపం వద్ద నిద్రించినట్లు తెలిసింది. అనారోగ్యం కారణంగా భక్తుడు ముత్యాలరెడ్డి మృతి చెందినట్లు చుట్టు ప్రక్కల నిద్రించే భక్తులు తెలిపారు. దేవస్థానం ఏఈవో వెంకటేశ్వర్లు భక్తుడి జేబులో ఉన్న ఆధార్‌కార్డు ప్రకారం చిరునామాను గుర్తించారు. బంధువులకు సమాచారమిచ్చారు. ప్రత్యేక అంబులెన్స్‌లో మృతుని స్వగ్రామానికి మృతదేహాన్ని తరలించారు.

ఆలయంలో సంప్రోక్షణ: మహానందిలో అనారోగ్యంతో మృతి చెందిన భక్తుడు ముత్యాలరెడ్డి మృతదేహాన్ని తరలించాకా ఆలయ పరిసరాల్లో అర్చకులు సంప్రోక్షణ పూజలు జరిపారు. వేదపండితులు రవిశంకర్ అవధాని, ఆంజనేయశర్మతో పాటు అర్చకులు శరభయ్య శర్మ ఆలయం పరిసరాలతో పాటు సుపథ మంటపం వద్ద సంప్రోక్షణలు చేసారు. కార్యక్రమంలో టెంపుల్ ఇన్‌స్పెక్టర్ శశిధర్‌రెడ్డి పాల్గొన్నారు.

అడ్రస్ ట్యాగులను విడగొట్టే ప్రక్రియ ప్రారంభం

నంద్యాల (కల్చరల్), జూన్ 29: భారత ఎన్నికల సంఘం ఆదేశాల మేరకు సార్వత్రిక ఎన్నికలకు వినియోగించిన వీవీ ప్యాట్‌లకు పేపర్ రోల్, అడ్రస్ ట్యాగులను విడగొట్టే ప్రక్రియను ప్రారంభించామని కలెక్టర్ డా.కె.శ్రీనివాసులు తెలిపారు. శనివారం టెక్క మార్కెట్ యార్డులోని ఈవీఎంలు భద్రపరచిన గోడౌన్లను జాయింట్ కలెక్టర్ రాహుల్‌కుమార్‌రెడ్డితో కలిసి రాజకీయ పార్టీల ప్రతినిధుల సమక్షంలో ఓపెన్ చేశారు. కలెక్టర్ మాట్లాడుతూ పార్లమెంట్, అసెంబ్లీ నియోజవర్గాల ఎన్నికలకు వినియోగించిన వీవీ ప్యాట్‌లు, అడ్రస్ ట్యాగులు పేపర్‌రోల్‌ను తొలగించే కార్యక్రమాన్ని చేపట్టామన్నారు. డీఆర్వో పద్మజ, డ్వామా పీడీ, వీవీ ప్యాట్‌ల నోడల్ అధికారి రామచంద్రారెడ్డి, అన్ని పార్టీల రాజకీయ ప్రతినిధులు తదితరులు పాల్గొన్నారు.

వైద్య శిబిరం

ఆత్మకూరు రూరల్, జూన్ 29: మండలంలోని పెచ్చెరువు, బైర్లూటి గూడేలలో రెడ్ క్రాస్ సొసైటీ జిల్లా చైర్మన్ దస్తగిరి పర్ల పర్యవేక్షణలో కర్నూలు కిమ్స్ వైద్యశాల వైద్యాధికారి సాయి కుమార్, బైర్లూటి పీహెచ్‌సీ వైద్యాధికారులు గోపాల్, పవన్‌కుమార్‌ల ఆధ్వర్యంలో శనివారం ఉచిత వైద్య శిబిరం ఏర్పాటు చేశారు. ఈ శిబిరంలో చెంచులకు వైద్య చికిత్సలు అందించి, ఉచితంగా మందులను పంపిణీ చేశారు. అలాగే అవసరమైన వారికి ఈసీజీ, షుగర్, బీపీ, గుండె పరీక్షలు, 2డీఎకో పరీక్షలు నిర్వహించి చికిత్సలు అందించారు. రెడ్‌క్రాస్ జిల్లా కోశాధికారి నాగేశ్వరరావు మాట్లాడుతూ మారుమూల ప్రాంతాల్లో జీవనం సాగిస్తున్న చెంచులకు అధునాతనమైన వైద్య సేవలు అందించే లక్ష్యంగా తాము ముందుకు సాగుతున్నట్లు తెలిపారు. రెడ్‌క్రాస్ సొసైటీ సభ్యులు నాగశేషులు, న్యాయవాది చింతలయ్య సోహెల్, బైర్లూటి గూడెం సర్పంచ్ గురువమ్మ, బైర్లూటి పీహెచ్‌సీ వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

ప్రజలకు రుణపడి ఉంటా: ఎమ్మెల్యే బుడ్డా



ఏబీఎం పాలెంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే బుడ్డా, ఆత్మకూరులో ఎమ్మెల్యేను సన్మానిస్తున్న ఏపీయూడబ్ల్యూజే నాయకులు

ఆత్మకూరు, జూన్ 29: ఎన్నికల్లో ప్రజలు తనపై చూపించిన ఆదరణకు ఎప్పటికీ రుణపడి ఉంటానని ఎమ్మెల్యే బుడ్డా రాజశేఖరరెడ్డి అన్నారు. ఆత్మకూరులోని ఏబీఎంపాలెం, కిషన్‌సింగ్‌వీధి ప్రాంతాల్లో థ్యాంక్స్ ఫర్ ఓటింగ్ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ ప్రధాన హామీలన్నీ పరిష్కరించేందుకు పాటుపడుతానన్నారు. అర్హులందరికీ సంక్షేమ పథకాలు అందిస్తామన్నారు. ఎన్నికల్లో శిల్పా బెదిరించినా, ప్రలోభ పెట్టినా ప్రజలు తనను ఆదరించారని అన్నారు.మాజీ ఎమ్మెల్యే శిల్పా అక్రమాలను త్వరలోనే ఆధారాలతో సహా బయటకు తీస్తానన్నారు. మాజీ సర్పంచ్ కంచర్ల గోవిందరెడ్డి, టీడీపీ మండల, పట్టణాధ్యక్షులు శివప్రసాద్‌రెడ్డి, వేణుగోపాల్, నాయకులు కలీముల్లా, అబ్దుల్లాపురం బాషా, యుగంధర్‌రెడ్డి, గౌస్‌లాజం, తిమోతి, సరోజమ్మ, సురేష్, రహీం, మోతుల్లా ఉన్నారు.

'కంటి వైద్య శిబిరం ఏర్పాటు అభినందనీయం'

ఉచితంగా కంటి వైద్యసేవలు అందించేందుకు డాక్టర్ సత్యనారాయణ కుటుంబం, చెన్నైలోని శంకర నేత్రాలయ కంటి వైద్యశాల వారు ముందుకు రావడం అభినందనీయమని ఎమ్మెల్యే బుడ్డా రాజశేఖరరెడ్డి అన్నారు. ఆత్మకూరులోని ఆర్అండ్‌బీ అతిథి గృహంలో శనివారం ఏర్పాటు చేసిన ఉచిత కంటి శుక్ల శస్త్రచికిత్స శిబిరాన్ని ఆయన ప్రారంభించారు. డాక్టర్ సత్యనారాయణ కుటుంబ సభ్యులు శ్రీనివాసశర్మ, ఇందూరి మాధురి లక్ష్మి, దీపా మహిళా జూనియర్ కళాశాల కరస్పాండెంట్ వెంకటరమణ ఉన్నారు.

టీడీపీ మైనార్టీ విభాగం కార్యాలయం ప్రారంభం

ఆత్మకూరులోని రఘునాథ్ సెంటర్ సమీపంలో టీడీపీ మైనార్టీ విభాగం జిల్లా అధ్యక్షుడు కలీముల్లా ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన కార్యాలయాన్ని శనివారం శ్రీశైలం ఎమ్మెల్యే బుడ్డా రాజశేఖరరెడ్డి ప్రారంభించారు.

'జర్నలిస్టుల సంక్షేమానికి కృషి'

నియోజకవర్గంలోని జర్నలిస్టుల సంక్షేమానికి తనవంతు కృషి చేస్తానని ఎమ్మెల్యే బుడ్డా రాజశేఖరరెడ్డి అన్నారు. శనివారం స్థానిక టీడీపీ కార్యాలయంలో ఎమ్మెల్యే బుడ్డాను ఆంధ్రప్రదేశ్ యూనియన్ ఆఫ్ వర్కింగ్ జర్నలిస్ట్స్ (ఏపీయూడబ్ల్యూజే) కమిటీ ఆధ్వర్యంలో ఘనంగా సత్కరించారు.

టీడీపీ సీనియర్ నాయకుడికి పరామర్శ

వెలుగోడు: వెలుగోడు పట్టణానికి చెందిన టీడీపీ సీనియర్ నాయకులు బన్నూరు రాఘవరెడ్డి అనారోగ్యంతో బాధ పడుతున్నారు. శ్రీశైలం ఎమ్మెల్యే బుడ్డారాజశేఖరరెడ్డి ఆయన ఇంటికి చేరుకుని ఆయనను పరామర్శించారు. మాజీ సర్పంచ్ అబ్దుల్ కలాం, మండ్ల శంకర్‌రెడ్డి, సంజీవరాయ ప్రసాద్, శంకర్‌రెడ్డి, గౌడు, తదితరులు ఉన్నారు.

మంత్రికి విలువ ఇవ్వకపోవడం దుర్మార్గం

- మూడున్నరేళ్ల ఖర్చుపై విజిలెన్స్ విచారణ చేయించాలి
- మున్సిపల్ కౌన్సిల్ సమావేశంలో నిలదీసిన టీడీపీ కౌన్సిలర్



మాట్లాడుతున్న కండె శ్యామ్‌సుందర్ లాల్, కౌన్సిల్ సమావేశానికి హాజరైన కౌన్సిలర్లు

నంద్యాల టౌన్, జూన్ 29: మంత్రి ఎన్ఎండీ ఫరూక్ పట్టణ అభివృద్ధికి సంబంధించి ఒక ప్రతిపాదనను ఎండార్స్ చేస్తూ కౌన్సిల్ తీర్మానంలో పెట్టాలని లేఖ ఇస్తే ఎజెండాలో పొందు పరచకపోవడం ఏమిటని టీడీపీ కౌన్సిలర్ కండె శ్యామ్‌సుందర్ లాల్ నిలదీశారు. శనివారం చైర్‌పర్సన్ మాబున్నీసా అధ్యక్షతన నంద్యాల మున్సిపల్ కౌన్సిల్ సమావేశం జరిగింది. ఈ సందర్భంగా శ్యామ్‌సుందర్ లాల్ మాట్లాడుతూ కౌన్సిల్ ఏర్పడి మూడు సంవత్సరాల నాలుగు నెలలైందని, పట్టణ అభివృద్ధికి, మున్సిపల్ ఖర్చులకు సంబంధించి ఎన్నో ఆరోపణలు వచ్చాయని అన్నారు. జమా ఖర్చులపై విజిలెన్స్ కమిటీ వేయాలని డిమాండ్ చేశారు. విజిలెన్స్ నివేదికను కౌన్సిల్ ముందు ఉంచాలని, మినిట్స్ బుక్కులో కూడా పొందుపరచాలని పేర్కొన్నారు. అభివృద్ధి కోసం స్వతంత్ర కౌన్సిలర్‌గా గెలిచిన తాను టీడీపీలో చేరానని తెలిపారు. ఈ విషయంపై చైర్‌పర్సన్ మాబున్నీసా మాట్లాడుతూ శ్యామ్‌సుందర్ డిమాండ్ చేసిన వాటిని నోట్ చేసుకుంటున్నానని పేర్కొన్నారు. టీడీపీ మహిళా కౌన్సిలర్ జైనాబీ మాట్లాడుతూ వార్డు కౌన్సిలర్‌గా రాజకీయ ప్రస్థానం ప్రారంభించి నాలుగు సార్లు నంద్యాల ఎమ్మెల్యేగా గెలిచి, మంత్రిగా బాధ్యతలు చేపట్టిన ఎన్ఎండీ ఫరూక్‌ను పట్టణ ప్రజలందరూ అభివృద్ధి కోసం గెలిపించుకున్నారని అన్నారు. వైసీపీ కౌన్సిలర్ దేశం సులోచన మాట్లాడుతూ ఒక అనధికార కట్టడం వల్ల మున్సిపల్ ఉద్యోగిపై దాడి చేశారని, అధికార యంత్రాంగం సరైన రీతిలో స్పందించలేదని పేర్కొన్నారు. టీడీపీ కౌన్సిలర్ శ్యామ్‌సుందర్ లాల్ మాట్లాడుతూ పట్టణ ప్రణాళికా విభాగంపై ఎన్నో ఆరోపణలు ఉన్నాయని, ఉద్యోగిపై దాడికి జరిగిన సంఘటనకు సంబంధించి ఆ అక్రమ కట్టడ నిర్మాణం వైసీపీ ప్రభుత్వ హయాంలోనే ప్రారంభమైందని, పునాదుల దశలో ఎందుకు ఆపలేకపోయారని విమర్శించారు. అక్రమ కట్టడ నిర్మాణాలపై తక్షణమే చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. చైర్‌పర్సన్ మాబున్నీసా మాట్లాడుతూ జరిగిన ఘటనపై విచారణ చేయిస్తానని పేర్కొన్నారు. సమావేశంలో కమిషనర్ నిరంజన్‌రెడ్డి, టీడీపీ, వైసీపీ కౌన్సిలర్లు, మున్సిపల్ వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.

మిట్టకందాలలో అతిసార

- ఆరుగురికి వాంతులు, విరేచనాలు
- గ్రామాన్ని సందర్శించిన డీఎంహెచ్‌వో


ఆత్మకూరులో చికిత్స పొందుతున్న మహిళ


మిట్టకందాలలో డీఎంహెచ్‌వో

పాములపాడు, జూన్ 29: మండలంలోని మిట్టకందాల గ్రామంలో గత రెండురోజులుగా గ్రామస్థులు వాంతులు విరేచానాల బారిన పడుతున్నారు. శనివారం జిల్లా వైద్యాధికారి వెంకటరమణ, జిల్లా ఆరోగ్యశాఖ అధికారి కాంతరావు, జిల్లా ప్రోగ్రాం ఆఫీసర్ జగదీష్ చంద్రారెడ్డి గ్రామాన్ని సందర్శించారు. గ్రామంలో నలుగురు చిన్నారులు, ఇద్దరు పెద్దలను ఆత్మకూరు, ప్రభుత్వ వైద్యశాలకు తరలించారు. గ్రామంలో మరికొంత మంది స్థానిక ఆర్ఎంపీలు, పాములపాడు, ప్రైవేటు వైద్యశాలల్లో చికిత్స పొందుతున్నారు. మిట్టకందాల గ్రామానికి చెందిన సుజాత అనే మహిళ ఆత్మకూరులోని వైద్యశాలలో చికిత్స పొందుతున్నారు. సీరియస్‌గా ఉండటంతో ఆత్మకూరు నుంచి కర్నూలు ప్రభుత్వ వైద్యశాలకు తరలించినట్లు సమాచారం. గ్రామంలో పైపులైన్ లీక్ అవడంతో నీరు కలుషితం కాకుండా మరమ్మతులు చేపట్టారు. గ్రామంలోని మంచినీటి బావులలో, బోర్లలోని నీటి శాంపిల్స్‌ను ల్యాబ్‌కు పంపించామని అధికారులు తెలిపారు. గ్రామంలో మెడికల్ క్యాంపు నిర్వహించామని పరిస్థితులు అదుపులో ఉన్నాయని మండల వైద్యాధికారి నాగలక్ష్మి తెలిపారు. కార్యక్రమంలె మెడికల్ సిబ్బంది మల్లికార్జున, ఆశా వర్కర్లు పాల్గొన్నారు.

'మాతా శిశు మరణాల రేటు తగ్గించాలి'

నంద్యాల (నూనెపల్లె): జిల్లాలో మాతాశిశు మరణాల రేటును తగ్గించాలని డీఎంహెచ్‌వో డాక్టర్ వెంకటరమణ ఆదేశించారు. శనివారం నంద్యాలలోని డీఎంహెచ్‌వో కార్యాలయంలో వైద్యాధికారులు, సిబ్బందితో సమీక్ష సమావేశం నిర్వహించారు. నందికొట్కూరులోని పీహెచ్‌సీ, ఎర్రమఠం, టంగుటూరు ఆరోగ్య కేంద్రాల పరిధిలో మాతృ మరణాలు జరగడంతో వైద్య సిబ్బందిపై ఆగ్రహం వ్యక్తం చేశారు. విధి నిర్వహణలో అలసత్వం వహిస్తే చర్యలు తప్పవని హెచ్చరించారు. జిల్లా ఇమ్యూనైజేషన్ అధికారి డాక్టర్ ప్రసన్న లక్ష్మి, వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

అక్రమాలకు పాల్పడితే కఠిన చర్యలు: డీఏవో


విత్తన దుకాణాన్ని తనిఖీ చేస్తున్న డీఏవో మురళీకృష్ణ

నంద్యాల టౌన్, జూన్ 29: జిల్లాలోని రైతాంగానికి నాణ్యమైన విత్తనాలను సరఫరా చేయాలని, అనుమతి ఉన్న విత్తనాలను మాత్రమే విక్రయించాలని, అక్రమాలకు, అవకతవకలకు పాల్పడితే కఠిన చర్యలు తీసుకుంటామని జిల్లా వ్యవసాయాధికారి వైవీ మురళీకృష్ణ హెచ్చరించారు. శనివారం నంద్యాల పరిధిలో పలు విత్తన దుకాణాలను తనిఖీ చేశారు. విజయలక్ష్మి సీడ్స్‌తో పాటు పలు దుకాణాల్లో స్టాక్ రిజిస్టర్లు, బిల్లు బుక్కులు, తదితర పత్రాలను తనిఖీ చేశారు. స్టాక్ రిజిస్టర్‌లో ఉన్న వివరాలకు అనుగుణంగా నిల్వలు ఉన్నాయా? లేదా? అని పరిశీలించారు. మురళీకృష్ణ మాట్లాడుతూ ధ్రువీకరణ పత్రాలు లేకుంటే విత్తనాలకు విక్రయించరాదని హెచ్చరించారు. ఎమ్మార్పీ కంటే ఎక్కువ ధరకు విక్రయించకూడదని, విత్తనం కొన్న ప్రతి రైతుకు రసీదులు ఇవ్వాలని ఆదేశించారు. అనంతరం డీఏవో కార్యాలయంలో విత్తన ప్రాసెసింగ్ యజమానులు, కేంద్రీయ విత్తన దుకాణాల యజమానులతో సమావేశం నిర్వహించారు. డీఏవో మురళీకృష్ణ మాట్లాడుతూ ప్రభుత్వం నుంచి అనుమతి పొందిన విత్తనాలను మాత్రమే మార్కెటింగ్ చేసుకోవాలని, ప్రాసెసింగ్, ప్లాంట్ రిజిస్టర్, డిస్పాచ్ రిజిస్టర్, బ్రీడర్ రిజిస్టర్ సక్రమంగా నిర్వహించాలని అన్నారు. విత్తనాలను ప్రాసెసింగ్ చేసేటప్పుడు కల్తీలు లేకుండా నాణ్యతా ప్రమాణాలు పాటించాలని, ప్యాకింగ్ చేసేటప్పుడు కూడా ఒకరకం విత్తనంలో మరోరకం విత్తనం కలవకుండా చూసుకోవాలని అన్నారు. విత్తనాల బ్యాగ్‌లపై ఆ రకం ప్రమాణాలు, ఇతర వివరాలు ఉండాలని, నిబంధనలు పాటించకుంటే చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. కార్యక్రమంలో ఏడీఆర్ రాజశేఖర్, ఏవో ప్రమాదరావు, తదితరులు పాల్గొన్నారు.

రేషన్ డీలర్ల రాజీనామా

గడివేముల, జూన్ 29: మండలంలో ముగ్గురు డీలర్లు శనివారం రాజీనామా చేసినట్లు సివిల్ సప్లయ్ డిప్యూటీ తహసీల్దార్ ప్రసాదు తెలిపారు. మండలంలోని గని గ్రామంలో 1వ షాపు, కె.బొల్లవరం గ్రామంలో 30వ షాపు, కరిమద్దెల గ్రామంలో 19వ షాపు నిర్వహిస్తున్న రేషన్ డీలర్లు తమ వ్యక్తిగత కారణాల వల్ల రాజీనామా చేశారని తెలిపారు. లబ్ధిదారులకు రేషన్ సరుకుల పంపిణీలో ఇబ్బందులు తలెత్తకుండా ఆయా గ్రామాల వీఆర్వోలకు బాధ్యతలు అప్పగించామని అన్నారు.

'ఫిజియో థెరపీతో ఆరోగ్యం'

పాములపాడు, జూన్ 29: నేటి జీవితంలో ప్రతి ఒక్కరికి ఫిజియో థెరపీతోనే ఆరోగ్యం సంపూర్ణమని హైదరాబాదు నిజాం ఫిజియో థెరప్పీప ఇనిస్టిట్యూట్ నిపుణులు రమేశ్, మహేశ్ అన్నారు. శనివారం పాములపాడులోని ఏఎన్ఆర్ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో నిర్వహించిన సమావేశంలో వారు మాట్లాడుతూ తలనొప్పి, మెడనొప్పి, నడుమునొప్పి మొదలైనవాటిని ఫిజియోథెరపీ నయం చేస్తుందని అవగాహన కల్పించారు. ఎంఈవో బాలాజీ నాయక్, సుభాషిణి, షంషద్దీన్, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

అట్రాసిటీ కేసుపై విచారణ

గడివేముల, జూన్ 29: మండలంలోని ఆళ్లగడ్డ గ్రామానికి చెందిన 8 మందిపై నమోదైన అట్రాసిటీ కేసుపై శనివారం ఆత్మకూరు డీఎస్పీ శ్రీనివాసరావు విచారణ చేపట్టారు. ఆళ్లగడ్డ గ్రామానికి చెందిన తిరుపాలు, అతని కొడుకు అరవింద్, అల్లుడు విజయ్‌ను అదే గ్రామానికి చెందిన లక్ష్మీరెడ్డి, సర్వేశ్వర్‌రెడ్డి, మోహన్‌రెడ్డి, వెంకటేశ్వర్‌రెడ్డి, నాగార్జున్‌రెడ్డి, అబ్బాస్, రమణారెడ్డి, మల్లారెడ్డిలు కులం పేరుతో దూషించి దాడి చేశారని బాధితుడు తిరుపాలు ఫిర్యాదు చేశారు. డీఎస్పీ శ్రీనివాసరావు సాక్షులను విచారించి వివరాలను నమోదు చేశారు. ఘటన జరిగిన తీరుపై ఆరా తీశారు. కార్యక్రమంలో ఎస్ఐ బీటీ వెంకటసుబ్బయ్య తదితరులు పాల్గొన్నారు.

జిల్లా స్థాయి బ్యాడ్మింటన్ పోటీలు ప్రారంభం

నంద్యాల (నూనెపల్లె), జూన్ 29: నంద్యాల నంది ఫైవ్స్ బ్యాడ్మింటన్ అకాడమీలో శనివారం ఉమ్మడి కర్నూలు జిల్లా స్థాయి బ్యాడ్మింటన్ పోటీలు ప్రారంభమయ్యాయి. ఉమ్మడి కర్నూలు జిల్లా స్థాయి బ్యాడ్మింటన్ అసోసియేషన్ ఆధ్వర్యంలో జరిగే పోటీలకు నంది గ్రూప్‌సంస్థల అధినేత సుజల హాజరై ప్రారంభించారు. గెలుపు ఓటమిని సమానంగా స్వీకరించి ముందుకు సాగాలని సూచించారు. జిల్లా బ్యాడ్మింటన్ అసోసియేషన్ కార్యదర్శి వంశిధర్ మాట్లాడుతూ.. రెండు రోజుల పాటు ఈ క్రీడలు జరుగుతాయన్నారు. కార్యక్రమంలో శేషిరెడ్డి, సంజీవరెడ్డి, కోచ్ నాగార్జున తదిరతులు పాల్గొన్నారు.

'చెస్ క్రీడతో మేధస్సుకు పదును'

నంద్యాల (నూనెపల్లె), జూన్ 29: చెస్ క్రీడతో మేదస్సుకు పదును అని రామకృష్ణ విద్యా సంస్థల చైర్మన్ డాక్టర్ రామకృష్ణారెడ్డి అన్నారు. జిల్లా చెస్ సంఘం ఆధ్వర్యంలో వివేకానంద ఆడి టోరియంలో అండర్ 19 బాల బాలికల చెస్ ఎంపిక పోటీలు నిర్వహించారు. డాక్టర్ రామకృష్ణారెడ్డితో పాటు డీఎస్‌డీవో రాజు, జిల్లా చెస్ సంఘం అధ్యక్షుడు డాక్టర్ రవికృష్ణ పోటీలను ప్రారంభించారు. ఈ పోటీల్లో ప్రతిభ చాటిన క్రీడాకారులను రాష్ట్ర స్థాయి పోటీలకు ఎంపిక చేస్తామని తెలిపారు. రాజా రమేష్ చక్రవర్తి, లయన్స్ క్లబ్ కార్యదర్శి నాగరాజు, సుజాత, క్రీడాకారులు పాల్గొన్నారు.

మహానందిలో ఐఏఎస్ అధికారి పూజలు

మహానంది, జూన్ 29: మహానంది క్షేత్రంలో శనివారం ఐఏఎస్ అధికారి, నంద్యాల పార్లమెంట్ ఎన్నికల ఎక్స్‌పెండీచర్ అధికారి మణికంఠన్ దంపతులు శనివారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. వీరికి ఆలయం వద్ద మండల తహసీల్దార్ రామచంద్రుడు స్వాగతం పలికారు. అనంతరం ప్రధాన ఆలయాల్లో ఐఏఎస్ అధికారి దంపతులు స్వామి, అమ్మవార్లకు అభిషేకార్చన పూజలను జరిపారు. ఆలయ ప్రాంగణంలోని కల్యాణ మంటపంలో వీరిని వేదపండితులు శాలువాతో సన్మానించి, ప్రసాదాలు అందచేసి ఆశీర్వదించారు. వీరివెంట డిప్యూటీ తహసీల్దార్ శ్రీనివాసులు, టెంపుల్ ఇన్‌స్పెక్టర్ శశిధర్‌రెడ్డి ఉన్నారు.

మంత్రిని కలిసిన ఎమ్మెల్యే


మంత్రి జనార్దన్‌రెడ్డితో మాట్లాడుతున్న నందికొట్కూరు ఎమ్మెల్యే

నందికొట్కూరు, జూన్ 29: మంత్రి బీసీ జనార్దన్ రెడ్డిని నందికొట్కూరు ఎమ్మెల్యే గిత్తా జయసూర్య నంద్యాలలో కలిశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే నందికొట్కూరు నియోజక వర్గంలో పెండింగ్‌లో ఉన్న రోడ్ల గురించి మంత్రితో చర్చించారు. సమస్యను త్వరితగతిన పరిష్కరించాలని మంత్రిని కోరినట్లు ఎమ్మెల్యే తెలిపారు.

కర్నూలు కలెక్టర్‌ను కలిసిన ఎమ్మెల్యే

కర్నూలు జిల్లా నూతన కలెక్టర్‌గా బాధ్యతలు చేపట్టిన రంజిత్ బాషాను నందికొట్కూరు ఎమ్మెల్యే గిత్తా జయసూర్య మర్యాదపూర్వకంగా కలిశారు. రంజిత్‌బాషా నందికొట్కూరు వాసి కావడంతో ఎమ్మెల్యే మర్యాదపూర్వకంగా కలిసి పుష్పగుచ్చం అందజేశారు. ఎమ్మెల్యేతో పాటు ప్రసాద్‌రెడ్డి, పలుచాని మహేశ్వరరెడ్డి, జమీల్, బ్రహ్మానందరెడ్డి, తదితరులు ఉన్నారు.

మంత్రి ఫరూక్‌కు సన్మానం


మంత్రి ఫరూక్‌ను సన్మానిస్తున్న నాయకులు

నందికొట్కూరు, జూన్ 29: ముస్లిం మైనార్టీ శాఖ మంత్రి ఎన్ఎండీ ఫరూక్‌ను నందికొట్కూరు ముస్లిం, మైనార్టీ నాయకులు శనివారం మర్యాదపూర్వకంగా కలిశారు. నందికొట్కూరు మున్సిపల్ కౌన్సిలర్ మొల్లా జాకీర్ హుస్సేన్, జమీల్, ముర్తుజావలి, రసూల్ మంత్రిని నంద్యాలలో కలిసి పుష్పగుచ్చం అందజేసి, శాలువాతో సన్మానించారు. ఈ సదర్భంగా నందికొట్కూరు నియోజకవర్గ సమస్యలను ఆయన దృష్టికి తీసుకెళ్లారు. కార్యక్రమంలో ప్రభుకుమార్ తదితరులు పాల్గొన్నారు.

'రహదారులు నిర్మించాలి'


మంత్రి బీసీ జనార్దన్‌రెడ్డిని కలిసిన టీడీపీ నాయకులు

బండిఆత్మకూరు, జూన్ 29: మండలంలోని ఎ.కోడూరు గ్రామం నుంచి పలు గ్రామాలకు వెళ్లేదారులకు బీటీ రోడ్లు నిర్మించాలని టీడీపీ నాయకులు రోడ్లు, భవనాల శాఖ మంత్రి బీసీ జనార్దన్‌రెడ్డిని కోరారు. శనివారం నంద్యాలలోని టీడీపీ కార్యాలయంలో ముందుగా శ్రీశైలం ఎమ్మెల్యే బుడ్డా రాజశేఖరరెడ్డిని కలిశారు. అనంతరం అక్కడే ఉన్న మంత్రిని ఎ.కోడూరు నాయకులు వడ్డు మధుసూధన్‌రెడ్డి, మార్కెట్ యార్డు మాజీ డైరెక్టర్ దేరెడ్డి శ్రీనివాసరెడ్డి, బారెడ్డి మోహన్‌రెడ్డి, శంకర్, శంకర్‌రెడ్డి మర్యాదపూర్వకంగా కలిశారు. పలు గ్రామాలకు సరైన రోడ్లు లేక ప్రజలు, రైతులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని మంత్రికి వివరించారు.

మంత్రులను కలిసిన టీడీపీ నాయకులు


మంత్రులను కలిసిన టీడీపీ నాయకులు

గడివేముల, జూన్ 29: నంద్యాల పట్టణంలో రోడ్లు, భవనాల శాఖ మంత్రి బీసీ జనార్దన్‌రెడ్డి, రాష్ట్ర న్యాయ, మైనార్టీశాఖ మంత్రి ఫరూక్‌ను టీడీపీ సీనియర్ నాయకులు రామచంద్రారెడ్డి, వంశీధర్‌రెడ్డి, మద్దిలేటిరెడ్డి శనివారం కలిశారు. మంత్రులకు పుష్పగుచ్చం ఇచ్చి శుభాకాంక్షలు తెలిపారు. కార్యక్రమంలో టీడీపీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

'లోక్ అదాలత్‌లో 43 కేసులు పరిష్కారం'


లోక్ అదాలత్ కార్యక్రమాన్ని నిర్వహిస్తున్న దృశ్యం

ఆత్మకూరు, జూన్ 29: ఆత్మకూరు కోర్టు ఆవరణలో శనివారం నిర్వహించిన నేషనల్ లోక్ అదాలత్‌లో 43 కేసులను పరిష్కరించినట్లు సీనియర్ సివిల్ కోర్టు న్యాయాధికారి వెంకటేశ్వరరావు తెలిపారు. ఆయన మాట్లాడుతూ ఆత్మకూరు సీనియర్, జూనియర్ సివిల్ జడ్జిల కోర్టుల పరిధిలో మొత్తం 43 కేసులను పరిష్కరించినట్లు తెలిపారు. ఇందులో క్రిమినల్ కేసులు 24, సివిల్ కేసులు 12, మెయింటెనెన్స్ కేసు 1, బ్యాంకు కేసులు 4, చెక్‌బౌన్స్ కేసు 1, గృహహింస 1 చొప్పున మొత్తం 43కేసులను పరిష్కరించారు. కార్యక్రమంలో న్యాయవాదులు మురళీమోహన్, లక్ష్మీనారాయణ, శాకమూరి గిరిరాజు, వేముల వెంకటేశ్వర్లు, కేశవరెడ్డి, బలరామ్‌రాథోడ్, నగేష్, మాణిక్యం తదితరులు ఉన్నారు.

బైకులను ఢీకొట్టిన కారు.. ఇద్దరికి గాయాలు

మహానంది, జూన్ 29: మండలంలోని గోపవరం సమీపంలోని పైపుల ఫ్యాక్టరీ వద్ద శనివారం నంద్యాల నుంచిగిద్దలూరు వైపు వెళ్తున్న కారు ఎదురుగా వస్తున్న రెండు ద్విచక్ర వాహనాలను ఢీకొని ఆపకుండా వెళ్లిపోయింది. ఈ ఘటనలో గోపవరం గ్రామానికి చెందిన తలారి దస్తగిరి వలీతో పాటు మరో వ్యక్తి గాయపడ్డారు. మహానంది పోలీసులు సమాచారాన్ని ప్రకాశం జిల్లా గిద్దలూరు పోలీసులకు తెలిపారు. వెంటనే రంగంలోకి దిగి దిగువమెట్ట వద్ద ప్రమాదం జరిగిన కారును పోలీసులు గుర్తించి స్వాధీనం చేసుకున్నారు. గాయపడ్డ ఇద్దరిని చికిత్స కోసం నంద్యాల ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

'భూసార పరీక్షలు తప్పనిసరి'

గడివేముల, జూన్ 29: రైతులు తమ పొలంలో అధిక దిగుబడులు సాధించాలన్నా, రసాయన ఎరువుల వాడకం తగ్గించాలన్నా తప్పనిసరిగా భూసార పరీక్షలు చేయించాలని మండల వ్యవసాయాధికారి హేమసుందర్ రెడ్డి అన్నారు. బిలకలగూడురు గ్రామంలో శనివారం భూ సార పరీక్షలపై రైతులకు అవగాహన కల్పించి మట్టి నమూనాలను సేకరించారు. ఆయన మాట్లాడుతూ మండలంలో 588 మట్టి నమూనాలను సేకరించామని అన్నారు. భూ సార పరీక్షలకు 5 ఎకరాలకు ఒక యూనిట్‌గా తీసుకొని చదునుగా ఉన్న పొలంలో ఒక నమూనాకు 15 చోట్ల మట్టిని సేకరించాలని అన్నారు. భూసార పరీక్షలు నిర్వహించడం వల్ల భూమిలో ఉన్న పోషకాలను గుర్తించవచ్చన్నారు. భూమిలో ఉన్న పోషకాల నిల్వలను బట్టీ పంటను సాగు చేయడం వల్ల అధిక దిగుబడులు సాధించవచ్చని అన్నారు. రైతులు తప్పనిసరిగా భూసార పరీక్షలు చేయించుకోవాలని అన్నారు. వ్యవసాయశాఖ సిబ్బంది, రైతులు పాల్గొన్నారు.

టీడీపీతోనే పేదల సంక్షేమం

చాగలమర్రి, జూన్ 29: రాష్ట్ర ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు తోనే పేదల సంక్షేమం సాధ్యమని టీఎన్‌టీయూసీ రాష్ట్ర కార్యదర్శి గుత్తి నరసింహులు అన్నారు. శనివారం చాగలమర్రి టీడీపీ కార్యాలయంలో టీడీపీ రాష్ట్ర మైనార్టీసెల్ ఉపాధ్యక్షుడు అన్సర్‌బాషాను సీఐటీయూ, అంగన్‌వాడీ వర్కర్లు శాలువ, పూలమాలలతో సన్మానించారు.

పాఠశాలలను బలోపేతం చేయండి



చాగలమర్రిలో మాట్లాడుతున్న ఏఎంవో లలితమ్మ

చాగలమర్రి, జూన్ 29: గ్రామాల్లోని ప్రభుత్వ పాఠశాలలను బలోపేతం చేయాలని జిల్లా ఏఎంవో లలితమ్మ హెచ్‌ఎంలకు సూచించారు. శనివారం చాగలమర్రి గ్రామంలోని బాలుర ఉన్నత పాఠశాలను తనిఖీ చేశారు. విద్యార్థులకు సంబంధించిన పాఠ్యపుస్తకాలు, యూనిఫామ్, బ్యాగ్‌లను పరిశీలించారు. ఆమె మాట్లాడుతూ జిల్లాలో 13.37 లక్షల పాఠ్యపుస్తకాలు, 1.52 లక్షల స్కూల్ బ్యాగులు, 1.52 లక్షల యూనిఫామ్ దుస్తులు, బూట్లు, 1.3 లక్షల బెల్టులు, 28,934 డిక్షనరీలను ఆయా పాఠశాలలకు అందజేశామని అన్నారు. అనంతరం విద్యార్థులకు బూట్లను పంపిణీ చేశారు. కార్యక్రమంలో జిల్లా అకడమిక్ మానిటరింగ్ సహాయ అధికారి యూనస్‌బాషా, ఎంఈవోలు అనూరాధ, న్యామతుల్లా, హెచ్‌ఎం కోటయ్య, సీఆర్పీలు, ఎమ్మార్సీ సిబ్బంది ఉన్నారు.

డెంగీపై అవగాహన ర్యాలీ

చాగలమర్రి, జూన్ 29: మండలంలోని రాంపల్లె గ్రామంలో మలేరియా మాసోత్సవం సందర్భంగా శనివారం డెంగీ, మెదడువాపు వ్యాధులపై వైద్యులు ఇమ్రాన్ ఆధ్వర్యంలో విద్యార్థులు, వైద్య సిబ్బంది కలిసి అవగాహన ర్యాలీ చేశారు. వీధుల్లో పర్యటించి సీజనల్ వ్యాధుల గురించి ప్రజలకు తెలియజేశారు. కార్యక్రమంలో సూపర్‌వైజర్ రామలింగారెడ్డి, సీహెచ్‌వో శ్రీకాంత్, ఎంపీహెచ్‌ఏ శేఖర్, అంగన్‌వాడీ వర్కర్ శ్యామల, ఆశా వర్కర్లు పాల్గొన్నారు.

అబ్దుల్లా మృతి బాధాకరం



చాగలమర్రిలో బాధిత కుటుంబీకులను పరామర్శిస్తున్న టీడీపీ నాయకుడు

చాగలమర్రి, జూన్ 29: చాగలమర్రి గ్రామంలోని మల్లెవేముల బస్టాండు సమీపంలో నివాసం ఉంటున్న అబ్దుల్లా రోడ్డు ప్రమాదంలో మృతి చెందడం బాధాకరమని టీడీపీ రాష్ట్ర మైనార్టీసెల్ ఉపాధ్యక్షుడు అన్సర్‌బాషా అన్నారు. శనివారం మృతుడి నివాసం వద్ద బాధిత కుటుంబీకులను పరామర్శించి వారిలో మనోధైర్యం నింపారు. అబ్దుల్లా మృతి పట్ల సంతాపం ప్రకటించి కుటుంబం పట్ల సానుభూతి వ్యక్తం చేశారు. ఆయన వెంట టీడీపీ నాయకులు పాల్గొన్నారు.

ప్రిన్సిపాల్‌ను సస్పెండ్ చేయాలి

● ఏఐఎస్ఎఫ్ ఆధ్వర్యంలో ధర్నా



డోన్‌లో జ్యోతిరావుపూలే బీసీ బాలికల గురుకుల హాస్టల్ ముందు ఆందోళన చేస్తున్న ఏఐఎస్ఎఫ్ నాయకులు

డోన్(రూరల్), జూన్ 29: డోన్ పట్టణం గుత్తిరోడ్డులో ఉన్న జ్యోతిరావు పూలే బీసీ బాలికల సంక్షేమ హాస్టల్ ప్రిన్సిపాల్‌ను తక్షణమే సస్పెండ్ చేయాలని ఏఐఎస్ఎఫ్ జిల్లా అధ్యక్షులు సూర్యప్రతాప్ డిమాండ్ చేశారు. శనివారం ఏఐఎస్ఎఫ్ ఆధ్వర్యంలో జ్యోతిరావుపూలే బీసీ సంక్షేమ హాస్టల్ వద్ద ఏఐఎస్ఎఫ్ ఆధ్వర్యంలో విద్యార్థులు ధర్నా నిర్వహించారు. సూర్యప్రతాప్ మాట్లాడుతూ హాస్టల్‌లో ఉంటున్న ఇద్దరు బాలికలు అదృశ్యమై కర్నూలులో ప్రత్యక్షం కావడంపై ఆగ్రహం వ్యక్తం చేశారు. ఇంత నిర్లక్ష్యంగా ఉంటే ఎలా అని ప్రశ్నించారు. ధర్నా చేస్తున్నారన్న విషయం తెలుసుకున్న పట్టణ పోలీసులు ఏఐఎస్ఎఫ్ నాయకులను అరెస్టు చేసి జీపులో పట్టణ పోలీస్‌స్టేషన్‌కు తరలించారు.

విద్యార్థులకు బహుమతులు



ప్రతిభ కనబరచిన విద్యార్థులకు నగదు ప్రోత్సాహక బహుమతులు పంపిణీ చేస్తున్న పూర్వ విద్యార్థులు

బనగానపల్లె , జూన్ 29 : మండలంలోని ఇల్లూరుకొత్తపేటలో పదో తరగతిలో ప్రతిభ కనబరచిన విద్యార్థులకు పూర్వ విద్యార్థులు నగదు బహుమతిని శనివారం ఇల్లూరుకొత్తపేట జిల్లాపరిషత్ ఉన్నతపాఠశాలలో పంపిణీ చేశారు. 2023-24 సంవత్సరంలో పదో తరగతిలో ఉత్తీర్ణత సాధించిన విద్యార్థులకు పూర్వ విద్యార్థులైన మల్లారెడ్డి, కోడినగేశ్‌బాబు, తులసిరెడ్డి, బలరాం, రామ్‌మద్దిలేటిరెడ్డి కలిసి పంపిణీ చేశారు. పదోతరగతిలో 579 మార్కులు సాధించిన విష్ణువర్ధన్‌కు రూ.5వేలు, 569 మార్కులు సాధించిన గౌతమికి రూ.3వేలు, పంపిణీ చేశారు. 568 మార్కులు సాధించిన నందినికి రూ.రూ2వేలు నగదు బహుమతిని అం దించారు. అలాగే ఉపాధ్యాయుడు లక్ష్మణమూర్తి వ్యక్తిగతంగా ముగ్గురు విద్యార్థులకు రూ.3వేలు నగదు బహుమతి అందించారు. కార్యక్రమంలో పూర్వ విద్యార్థులను హెచ్‌ఎం సోమశేఖర్‌రెడ్డి, ఉపాధ్యాయినీ, ఉపాధ్యాయులు అభినందించారు.

దుర్గాపేటలో సమస్యలు పరిష్కరించాలి



తాగునీటి సమస్య పరిష్కరించాలని అధికారులను ఆదేశిస్తున్న చైర్మన్

బేతంచెర్ల, జూన్ 29: పట్టణంలోని దుర్గాపేటలో కొత్త బిల్డింగులలో ప్రజలు ఎదుర్కొంటున్న తాగునీటి సమస్య పరిష్కరించాలని దుర్గాపేటలో, సంజీవనగర్‌లోని సామూహిక మరుగుదొడ్లకు నీటి సౌకర్యం కల్పించాలని టీడీపీ వార్డు కౌన్సిలర్లు నంద్యాల కుమారి, రామాంజనేయులు, చైర్మన్ చలంరెడ్డి కోరారు. శనివారం పట్టణంలోని కార్యాలయం సమావేశ భవనంలో నగర పంచాయతీ చైర్మన్ చలంరెడ్డి అధ్యక్షతన వార్డు కౌన్సిలర్లు సర్వసభ్య సమావేశం కమిషనర్ రమేష్‌బాబు నిర్వహించారు. టీడీపీ పదో వార్డు కౌన్సిలర్ రామాంజనేయులు మాట్లాడుతూ నగర పంచాయతీ కార్యాలయంలో మెప్మాలో పని చేసేందుకు యువకుడిని చేర్చుకోకపోవడం ఎందుకని, అతని స్థానలో సువర్ణలక్ష్మిని తాత్కాలిక డేటా ఎంట్రీ ఆపరేటర్‌గా తీసుకోవడం జరిగిందని చైర్మన్ చలంరెడ్డి కమిషనర్ రమేష్‌బాబును ఆయన ప్రశ్నించారు. అందుకు కమిషనర్ స్పందిస్తూ మెప్మా విభాగం అధికారుల ఆదేశాల మేరకే ఆమెను నియమించడం జరిగిందని సమాధానం ఇచ్చారు. టీడీపీ 15వ వార్డు కౌన్సిలర్ రామగోపాల్ మాట్లాడుతూ రేగుమానిపేట, చాకలిపేటలో రోడ్లు వేయలేదని ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారన్నారు. త్వరలోనే పనులు పూర్తి చేస్తామని చైర్మన్ అన్నారు. వార్డు కౌన్సిలర్ నాగజ్యోతి మాట్లాడుతూ హనుమాన్‌నగర్‌లో వీది దీపాలు లేవని, డ్రైనేజీ కాలువలు శుభ్రం చేయకపోవడంతో మురికినీరు అంతా రోడ్లపై పారుతుందని ఆమె చైర్మన్, కమిషనర్ల దృష్టికి తీసుకువచ్చారు. కమిషనర్ రమేష్‌బాబు స్పందిస్తూ వీది దీపాలు త్వరలో వాటి ఏర్పాటు చేస్తానని, డ్రైనేజీ కాలువలు పారిశుధ్య కార్మికులతో శుభ్రం చేస్తానన్నారు. వార్డు కౌన్సిలర్ ఇబ్రహిం మాట్లాడుతూ ఈ ఏడాది ఏప్రిల్ నుంచి 2025 మార్చి వరకు బాడుగ పద్దతిలో తీసుకోవడం జరుగుతుందన్నారు. నగర పంచాయితీలో వార్డు కౌన్సిలర్ సర్వసభ్య సమావేశం టీడీపీ ప్రభుత్వం వచ్చిన తర్వాత మొట్టమొదటిసారిగా జరుగుతున్న నేపథ్యంలో ముగ్గురు సీఐలు, ఎస్ఐ స్పెషల్ పార్టీ కానిస్టేబుళ్లు, నగర పంచాయతీ వద్ద భారీ బందోబస్తు నిర్వహించడం కొసమెరుపు. ఈ సమావేశంలో వార్డు కౌన్సిలర్లు, కార్యాలయ సిబ్బంది పాల్గొన్నారు.

ఆర్యవైశ్యులు రాజకీయంగా ఎదగాలి: మంత్రి

బనగానపల్లె, జూన్ 29 : ఆర్యవైశ్యులు వ్యాపారం రంగంలోనే కాకుండా రాజకీయంగా ఎదగాలని మంత్రి బీసీ జనార్దన్‌రెడ్డి అన్నారు. శనివారం బనగానపల్లె టీడీపీ కార్యాలయంలో మంత్రి బీసీని ఆర్యవైశ్య సంఘం నాయకులు, వ్యాపారులు కలిసి ప్రపంచ ఆర్యవైశ్య మహాసభల జిల్లా అధ్యక్షుడు టంగుటూరు శ్రీనయ్య ఆధ్వర్యంలో మంత్రిని కలుసుకొని ఘనంగా సత్కరించారు. పట్టణంలో వ్యాపార వృద్ధికి, ఇతర రంగాల్లో అభివృద్ధి చేసేందకు కృషి చేస్తామన్నారు. టీడీపీ ప్రభుత్వంలో రాష్ట్రంలో ఉన్న ఆర్యవైశ్యుల ఆర్థిక, రాజకీయ అభివృద్ధికి పెద్దపీట వేయడం జరుగుతుందన్నారు. పీఎస్ఎస్ నారాయణ, శివచంద్రయ్య, భరతుడు కాసుల జంగంశెట్టి, భరతుడు, బచ్చు బాస్కర్, వంకదార ప్రసాద్, శివరాజు, భవనం శ్రీనివాసులు, మధుసూధన్, బండారు ప్రకాశ్ తదితర ఆర్యవైశ్యులు పాల్గొన్నారు.



మంత్రి బీసీని సత్కరిస్తున్న ఆర్యవైశ్యులు

మంత్రి బీసీకి సత్కారం

బనగానపల్లె , జూన్ 29 : మంత్రి బీసీ జనార్దన్‌రెడ్డిని బనగానపల్లె మార్కెట్‌యార్డు కార్యదర్శి వెంకటేశ్వరరెడ్డి, సిబ్బంది శనివారం అభినందించారు. మంత్రిగా బాధ్యతలు స్వీకరించిన బీసీ జనార్దన్‌రెడ్డిని కలిసి పూలబోకే, శాలువాతో సత్కరించారు. మార్కెట్‌యార్డు బలోపేతానికి తన వంతు కృషి చేస్తామని మంత్రి హామీ ఇచ్చారని వెంకటేశ్వరరెడ్డి తెలిపారు. అలాగే అసంపూర్తిగా ఉన్న గోదాముల నిర్మాణం పనుల వివరాలు అడిగి బీసీ తెలుసుకున్నారని తెలిపారు.

ఊరూరా పింఛన్ల పండుగ

డోన్, జూన్ 29: డోన్ నియోజకవర్గంలో పింఛన్ల పంపిణీ కార్యక్రమాన్ని పండుగ వాతావరణంలో జరిపేలా ఎమ్మెల్యే కోట్ల సూర్యప్రకాష్ రెడ్డి చర్యలు తీసుకుంటున్నారు. సోమవారం నియోజకవర్గంలోని ప్రతి గ్రామం, ప్రతి వార్డులో లబ్ధిదారుల ఇళ్ల వద్దకే వెళ్లి పింఛన్లు పంపిణీ చేసేలా ఏర్పాట్లు చేయాలని ఎమ్మెల్యే కోట్ల సంబంధిత అధికారులను ఆదేశించారు. రాష్ట్ర ముఖ్యమంత్రిగా బాధ్యతలు చేపట్టిన తర్వాత సీఎం చంద్రబాబు సామాజిక పింఛన్లను రూ.4వేలకు పెంచుతూ మూడో సంతకం చేశారు. పెంచిన పింఛన్ మొత్తాన్ని ఏప్రిల్ నుంచి ఇస్తామని ఇచ్చిన హామీ మేరకు జూలై 1వ తేదీన లబ్ధిదారులకు రూ.7వేలు పింఛన్ సొమ్ము అందజేసేలా ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది. దీంతో డోన్ నియోజకవర్గంలో జూలై 1న జరిగే పింఛన్ల పంపిణీ కార్యక్రమాన్ని పండుగ వాతావరణంలో జరపాలని ఎమ్మెల్యే కోట్ల ఆదేశాలు జారీ చేశారు. డోన్ మండలంలోని కొచ్చెర్వు, యు.కొత్తపల్లి గ్రామాల్లో జరిగే పింఛన్ల పంపిణీ కార్యక్రమంలో ఎమ్మెల్యే కోట్ల పాల్గొననున్నారు. ఆ తర్వాత ప్యాపిలి మండలంలో సాయంత్రం బేతంచెర్ల మండలంలో ఎమ్మెల్యే కోట్ల సూర్యప్రకాష్ రెడ్డి లబ్ధిదారులకు పింఛన్ల సొమ్మును అందజేయనున్నారు.

ఉయ్యాలవాడ: మండలంలోని అన్ని గ్రామాల్లో సోమవారం పింఛన్ల పంపిణీకి సర్వం సిద్ధం చేశామని ఎంపీడీవో రఘురామ్ శనివారం తెలిపారు. ఆయన మాట్లాడుతూ సోమవారం ఉదయం 6 గంట నుండి సాయంత్రం ఆరు గంటల వరకు సచివాలయ ఉద్యోగులు ఇంటి వద్దకే వచ్చి పింఛన్లు పంపిణీ చేస్తారన్నారు. పింఛన్ల పంపిణీకి 85 మంది సచివాలయ సిబ్బందిని నియమించామన్నారు. మండలంలో 3,965 మంది వివిద రకాల పింఛన్ దారులు ఉన్నారన్నారు. జూలై నెల దివ్యాంగులకు ఆరు వేలు, వృద్ధులు, వితంతువులు, ఇతరులకు ఏడు వేలు అందిస్తామన్నారు. ఆగస్టు నుండి దివ్యాంగులకు 6 వేలు, ఇతరులకు 4 వేలు ఇస్తామని ఆయన తెలిపారు.

ప్యాపిలి: 1న పింఛన్ల పంపిణీ కార్యక్రమాన్ని పండుగ తరహాలో నిర్వహించనున్నట్లు టీడీపీ మండల అధ్యక్షుడు గండికోట రామసుబ్బయ్య తెలిపారు. శనివారం పట్టణంలోని పార్టీ కార్యాలయంలో ఆయన మాట్లాడుతూ ఎన్నికల్లో ఇచ్చిన హామీ మేరకు ముఖ్యమంత్రి చంద్రబాబు వృద్ధులు, వితంతువులకు రూ.4వేలు, వికలాంగులకు రూ.6వేలు పింఛన్లు పంపిణీ చేయడం జరుగుతుందన్నారు. సమావేశంలో కలచట్ల ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

రుద్రవరం: 1న ఇంటి వద్దకే పింఛన్ల పంపిణీ చేస్తున్నామని ఎంపీడీఓ రామచంద్ర శనివారం తెలిపారు. పింఛన్లు పంపిణీ చేసేందుకు వలంటీర్ రహిత సిబ్బందిని 236 మందిని ఎంపిక చేశామన్నారు. మండలంలోని 16 సచివాలయాల పరిధిలో 21 పంచాయతీల్లో 6401 మంది పింఛనుదారులు ఉన్నారన్నారు.

అవుకు: మండలంలో పింఛన్‌ల పంపిణీకి ఏర్పాట్లు పూర్తి చేసినట్లు ఎంపీడీవో మల్‌రెడ్డి శనివారం తెలిపారు. ఎంపీడీవో మాట్లాడుతూ మండల వ్యాప్తంగా 18 సచివాలయాల్లోని 140 మంది సిబ్బందిని పింఛన్‌ల పంపిణీ కోసం నియమించామన్నారు. మండలంలో 6177మంది పింఛన్ లబ్ధిదారులు ఉండగా, రూ.4కోట్ల 16లక్షల 52వేలు పంపిణీ చేస్తామన్నారు. సచివాలయ సిబ్బంది లబ్ధిదారుల ఇళ్ల వద్దకే వెళ్లి పింఛన్ డబ్బులు అందిస్తారన్నారు.

కొలిమిగుండ్ల రూరల్: మండలంలోని వివిద గ్రామాల్లో 1న పింఛన్ పంపిణీ కోసం 130మంది సిబ్బందిని నియమించినట్లు కొలిమిగుండ్ల మండల ఎంపిడిఓ సాయిక్రిష్ణ శనివారం వెల్లడించారు. మండలంలో మొత్తం వృద్దాప్య, వికలాంగ, వితంతు పింఛన్లకు సంబంధించి 7192 మంది లబ్ధిదారులు ఉన్నారన్నారు.

బనగానపల్లె: బనగానపల్లె మండలంలో 1న 12,652 మంది పేద పింఛన్‌దారులకు మంత్రి బీసీ జనార్దన్‌రెడ్డి చేతుల మీదుగా పెంచిన పింఛన్ పంపిణీ కార్యక్రమాన్ని ప్రారంభించనున్నట్లు బనగానపల్లె ఎంపీడీవో నాగరాజు శనివారం తెలిపారు. రూ. 7 వేల పింఛన్ పంపిణీని మంత్రి చేతుల మీదుగా ప్రారంభించనున్నట్లు ఎంపీడీవో తెలిపారు.

మున్సిపల్ చైర్మన్ పదవి కూటమిదే



జనసేన పార్టీ ఇన్‌చార్జి రాంపుల్లారెడ్డి సమక్షంలో జనసేన పార్టీలో చేరిన వైసీపీ కౌన్సిలర్ గురుమూర్తి

ఆళ్లగడ్డ, జూన్ 29: రానున్న రోజుల్లో ఆళ్లగడ్డ మున్సిపల్ చైర్మన్ పదవి కూటమి దక్కించుకోనున్నదని జనసేన పార్టీ ఇన్‌చార్జి ఇరిగెల రాంపుల్లారెడ్డి అన్నారు. ఆళ్లగడ్డలోని 24వ వార్డు వైసీపీ కౌన్సిలర్ గురుమూర్తి ఇరిగెల రాంపుల్లారెడ్డి సమక్షంలో జనసేన పార్టీలో శనివారం చేరారు. ఈయనతోపాటు మరో 25 కుటుంబాలు జనసేన పార్టీలో చేరాయి. కౌన్సిలర్‌కు జనసేన పార్టీ కండువా వేసి ఇరిగెల రాంపుల్లారెడ్డి సాదరంగా ఆహ్వానించారు. ఇప్పటికే కూటమిలో వైసీపీ కౌన్సిలర్లు 8 మంది చేరారని, ఇంకా చేరేందుకు కౌన్సిలర్లు సిద్ధంగా ఉన్నారని తెలిపారు. ఈ కార్యక్రమంలో జనసేన పార్టీ నాయకులు మహబూబ్ హుసేన్ తదితరులు ఉన్నారు.

పంట యాజమాన్య పద్ధతులపై రైతులకు అవగాహన

దొర్నిపాడు, జూన్ 29: మండలంలోని దొర్నిపాడు గ్రామంలో వ్యవసాయాధికారిణి సునిత ఆధ్వర్యంలో రైతులకు పంట యాజమాన్య పద్ధతులపై సమావేశం నిర్వహించారు. ఈ సమావేశంలో ఏడీఏ సరళమ్మ, కీటకశాస్త్ర నిపుణులు శివరామకృష్ణ హాజరయ్యారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ రైతులు ప్రతి ఏడాది పంట మార్పిడి చేయడం వలన అధిక లాభాలు పొందవచ్చని అన్నారు. రైతులు సేంద్రియ ఎరువుల వాడకం వలన దిగుబడులు ఆశించిన స్థాయిలో ఉంటాయని అన్నారు. కార్యక్రమంలో ఏఈవో సురేంద్ర, సిబ్బంది, రైతులు ఉన్నారు.

టీడీపీలో చేరిన వైసీపీ వైస్ చైర్మన్



ఎమ్మెల్యే అఖిలప్రియ సమక్షంలో టీడీపీలో చేరిన వైసీపీ మున్సిపాలిటీ వైస్ చైర్మన్ నాయబ్ రసూల్

ఆళ్లగడ్డ, జూన్29 : ఆళ్లగడ్డ మున్సిపాలిటీని అన్ని రంగాల్లో తీర్చిదిద్దుతానన్న ఎమ్మెల్యే అఖిలప్రియ స్పష్టం చేశారు. మున్సిపాలిటీ వైసీపీ వైస్ చైర్మన్ నాయబ్ రసూల్ ఎమ్మెల్యే అఖిలప్రియ సమక్షంలో శనివారం ఆమె స్వగృహంలో చేరారు. ఆమె చేసే అభివృద్ధి పనులకు అండగా ఉంటానని వైస్ చైర్మన్ స్పష్టం చేశారు. పట్టణ ప్రజల సమస్యల పరిష్కారం కోసమే తాను టీడీపీలో చేరినట్లు పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో టీడీపీ కౌన్సిలర్ హుసేన్‌బాషా, చాగలమర్రి టీడీపీ నాయకుడు అన్సర్‌బాషా, వైస్ చైర్మన్ కుటుంబ సభ్యులు ఉన్నారు.

● ఎమ్మెల్యే అఖిలప్రియకు అభినందనలు వెల్లువెత్తుతున్నాయి. వివిద శాఖల అధికారులు ఎమ్మెల్యేను అభినందిస్తున్నారు. శనివారం ఆళ్లగడ్డ సబ్ రిజిస్ట్రార్ అబ్దుల్ సత్తార్ సిబ్బంది ఎమ్మెల్యే అఖిలప్రియకు పుష్పగుచ్ఛం ఇచ్చి అభినందించారు.

కేసుల పరిష్కారం

ఆళ్లగడ్డ, జూన్ 29: ఆళ్లగడ్డ పట్టణంలోని కోర్టు ఆవరణలో శనివారం నిర్వహించిన జాతీయ మెగా లోక్ అదాలత్‌లో న్యాయాధికారులు కేసులను పరిష్కరించినట్లు కోర్టు వర్గాలు తెలిపాయి. ఇందులో 40 సీసీ కేసులు, ఒకటి ఎంసీ, ఓస్‌లు 9, ఈపీలు 10 పరిష్కరించినట్లు తెలిపారు.

ఒక్క బస్సుతో విద్యార్థుల ఇక్కట్లు

● విద్యార్థుల బస్సు సంఖ్యను పెంచాలని డిమాండ్

డోన్(రూరల్), జూన్ 29: ప్రభుత్వ పాఠశాలలు తెరిచి రెండు వారాలు గడిచిపోతున్నా గ్రామీణ ప్రాంతాల నుంచి వచ్చే విద్యార్థుల కోసం విద్యార్థి బస్సును ఒక్కటే కేటాయించడం పట్ల విద్యార్థులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. డోన్ పట్టణ సమీపంలో ఏపీ మోడల్ స్కూల్, రెసిడెన్షియల్ గురుకుల పాఠశాలలు పట్టణంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలల్లో నడుస్తున్నాయి. గ్రామీణ ప్రాంతంతో పాటు గ్రామీణ ప్రాంతాల నుంచి డోన్‌కు వచ్చి చదువుకునే విద్యార్థులకు ఆర్టీసీ అధికారులు ఒక్క బస్సును మాత్రమే నడపడం దారుణమని ఎస్ఎస్‌యువ జిల్లా ఉపాధ్యక్షులు తెలుగు విజయకుమార్ విమర్శించారు. పట్టణ పాతబస్టాండు నుంచి మోడల్ స్కూల్ వెళ్లే విద్యార్థులు వచ్చే ఒక బస్సుకు సీట్లు నిండిపోయి ఉండటంతో ఆటోలను ఆశ్రయిస్తున్నారనీ విజయకుమార్ ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఆర్టీసీ అధికారులు 5 నుంచి6 దాకా విద్యార్థి బస్సులను నడిపి విద్యార్థుల ఇక్కట్లను తొలగించాలని, లేనిపక్షంలో ఆర్టీసీ డిపో ఎదురుగా పెద్ద ఎత్తున ఆందోళనలు చేస్తామని హెచ్చరించారు.



ఒకటే బస్సు ఉండటంతో ఎగబడుతున్న విద్యార్థులు

వాటర్ ట్యాంకుల వద్ద శుభ్రంగా ఉంచండి



నాగులవరంలో వాటర్ ట్యాంకు వద్ద పరిశీలిస్తున్న మధుసూదన్

రుద్రవరం, జూన్ 29 : వాటర్ ట్యాంకుల వద్ద శుభ్రంగా ఉంచాలని డీఈఈ మధుసూదన్ అన్నారు. శనివారం మండలంలోని ఆర్.నాగులవరం, తిప్పారెడ్డిపల్లె గ్రామాల్లోని వైఎస్ఆర్ ట్యాంకులను పరిశీలించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ వర్షాలు కురుస్తుండడంతో దోమలు వృద్ధి చెందుతున్నాయని, ప్రజలు అప్రమత్తంగా ఉండాలని సూచించారు. నిర్లక్ష్యం చేస్తే ప్రజలు ఇబ్బందులు తప్పవన్నారు. వాటర్‌ట్యాంకులను క్లోరినైజేషన్ ఎప్పటికప్పుడు చేయాలన్నారు. కార్యక్రమంలో ఏఈ ప్రమోద్ తదితరులు ఉన్నారు.

పల్లా నాయకత్వంలో పార్టీ బలోపేతం

అవుకు, జూన్ 29 : తెలుగుదేశం పార్టీ రాష్ట్ర అధ్యక్షుడు పల్లా శ్రీనివాసరావు యాదవ్ నాయకత్వంలో పార్టీ మరింత బలోపేతం అవుతుందని టీడీపీ రాష్ట్ర కార్యదర్శి చల్లా విజయభాస్కర్‌రెడ్డి శనివారం అన్నారు. ఆయన మాట్లాడుతూ టీడీపీ రాష్ట్ర అధ్యక్షుడిగా బాధ్యతలు చేపట్టిన పల్లా శ్రీనివాసరావుకు చల్లా విజయభాస్కర్‌రెడ్డి అభినందనలు తెలిపారు. టీడీపీ ఆవిర్భావం నుంచి బీసీ, బడుగు, బలహీన వర్గాలకు పెద్దపీట వేస్తుందన్నారు.

స్థలాలను కబ్జా చేసిన వారిని శిక్షించాలి

బనగానపల్లె , జూన్ 29 : ప్రభుత్వ స్థలాలు కబ్జా చేసిన వారిని కఠినంగా శిక్షించాలని బీజేపీ నాయకులు శనివారం డిమాండ్ చేశారు. బీజెపీ నాయకులు శివకృష్ణయాదవ్, శరత్‌చంద్రకుమార్ మాట్లాడుతూ గత ప్రభుత్వంలో బనగానపల్లె మండలం భానుముక్కలలో 94/1, 94/2, 96 సర్వేనంబర్లలో సుమారు 4 ఎకరాలు కొందరు రీయల్ ఎస్టేట్ వ్యాపారులు కబ్జా చేశారన్నారు త్వరలో మంత్రి బీసీ జనార్దన్‌రెడ్డిని కలసి కబ్జా దారులపై కఠిన చర్యలు తీసుకోవాలని వినతి పత్రం సమర్పించి కబ్జాదారులనుంచి ప్రభుత్వ భూములను కాపాడాలని కోరతామన్నారు. కార్యక్రమంలో బీజేపీ జిల్లా కిసాన్ మోర్చా జిల్లా ఉపాధ్యక్షుడు శివరామిరెడ్డి తదతరులు పాల్గొన్నారు.

పంటల పరిశీలన

డోన్(రూరల్), జూన్ 29: మండలంలోని చిన్నమల్కాపురం రైతు సేవా కేంద్రం పరిధిలో పంటలను డోన్ మండల వ్యవసాయాధికారి అబ్దుల్ షఫీ పరిశీలించారు. చిన్నమల్కాపురం పంచాయతీ పరిధిలో వలసల, పెద్దమల్కాపురం గ్రామాలున్నాయి. రైతులు కంది, కొర్ర, సజ్జ ఆముదం పంటలు సాగు చేయడంతో మండల వ్యవసాయాధికారి పంటలను పరిశీలించి సూచనలు చేశారు. కార్యక్రమంలో రైతుసేవా కేంద్ర సిబ్బంది నాగసులోచన, లత తదితరులు పాల్గొన్నారు.

డాక్టర్ నిర్లక్ష్యంపై ఆందోళన



డోన్ ప్రభుత్వ ఆసుపత్రి ఎదుట ఆందోళన చేస్తున్న సీపీఐ, మహిళా నాయకురాలు

డోన్(రూరల్), జూన్ 29: డోన్ ప్రభుత్వ ఆసుపత్రిలో గైనకాలజిస్టు నిర్లక్ష్యం వల్ల ఓ రోగి ఇబ్బంది పడుతున్నాడని సీపీఐ పట్టణ కార్యదర్శి నారాయణ, మహిళా సమైఖ్య జిల్లా ఆర్గనైజింగ్ కార్యదర్శి షమీమ్‌భేగం, సీపీఐ జిల్లా సమితి సభ్యులు ప్రభాకర్ అన్నారు. శనివారం సీపీఐ ఆధ్వర్యంలో డోన్ ప్రభుత్వ ఆసుపత్రి ఎదుట చేపట్టారు. వారు మాట్లాడుతూ గత నెల 5వ తేదీన డోన్ కొండపేటకు చెందిన భవాని అనే 9 నెలల గర్భిణి వైద్యం కోసం అడ్మిట్ కావడం జరిగిందన్నారు. గైనకాలజిస్టు నిర్లక్ష్యం వల్లనే పేషెంట్ తీవ్ర ఆరోగ్య సమస్యకు గురైందని ఆవేదన వ్యక్తం చేశారు. డాక్టరుపై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు.

రాష్ట్ర టీడీపీ అధ్యక్షుడికి శుభాకాంక్షలు

కోవెలకుంట్ల, జూన్ 29 : ఆంధ్రప్రదేశ్ టీడీపీ రాష్ట్ర అధ్యక్షులు, గాజువాక ఎమ్మెల్యే పల్లా శ్రీనివాస్‌రావును రాష్ట్ర టీడీపీ కార్యదర్శి గడ్డం రామక్రిష్ణరెడ్డి మర్యాదపూర్వకంగా కలిసి శుభాకాంక్షలు తెలియజేశారు. ఆయన శనివారం కోవెలకుంట్లలో ఆయన మాట్లాడుతూ రాష్ట టీడీపీ అధ్యక్షుడిగా గాజువాక ఎమ్మెల్యే పల్లా శ్రీనివాస్‌రావును శుక్రవారం అమరావతిలో ప్రమాణ స్వీకార కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి కోవెలకుంట్ల నుండి టీడీపీ నాయకులతో కలిసి అమరావతికి వెళ్లి ప్రమాణ స్వీకార అనంతరం ఆయనను కలిసి శుభాకాంక్షలు తెలిపినట్లు ఆయన తెలిపారు.

రైతులకు అందుబాటులో ఎరువులు

కొలిమిగుండ్ల రూరల్, జూన్ 29: మండలంలోని వివిధ గ్రామాల రైతు భరోసా కేంద్రాల్లో ఎరువులు అందుబాటులో ఉన్నాయని మండల వ్యవసాయాధికారి జ్యోతి శనివారం వెల్లడించారు. రైతులకు మొత్తం 13 రైతు భరోసా కేంద్రాల ద్వారా మండలంలో సేవలందిస్తున్నట్లు ఆమె పేర్కొన్నారు. ఖరీఫ్ సాగు కోసం ఎరువులు అవసరమైన రైతులు ఆయా గ్రామాల్లోని రైతుల భరోసా కేంద్రాల్లో సంప్రదించాలని మండల వ్యవసాయాధికారి జ్యోతి సూచించారు.

కొలిమిగుండ్ల ఎంపీడీవోపై కలెక్టర్ ఆగ్రహం..!

కొలిమిగుండ్ల రూరల్, జూన్ 29: నంద్యాల కలెక్టర్ డా.కె.శ్రీనివాసులు కొలిమిగుండ్ల ఎంపీడీవో సాయిక్రిష్ణపై ఆగ్రహం వ్యక్తం చేసినట్లు తెలిసింది. ప్రభుత్వం ఎంతో ప్రతిష్ఠాత్మకంగా చేపడుతున్న సామాజిక పింఛన్ కార్యక్రమంపై శనివారం కలెక్టర్ ఎంపీడీవోలతో వీడియో కాన్ఫరెన్స్ కార్యక్రమం నిర్వహించారు. అయితే కొలిమిగుండ్ల ఎంపీడీవో కార్యాలయం నుంచి ఈ కార్యక్రమంలో ఎంపీడీవోతో సహ కార్యాలయం నుంచి ఎవ్వరూ పాల్గొనకపోవడంతో కలెక్టర్ తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేసినట్లు తెలుస్తోంది.

మద్దిలేటి స్వామి క్షేత్ర ఆదాయం రూ.2.72 లక్షలు

బేతంచెర్ల, జూన్ 29: మండలంలోని ఆర్ఎస్ రంగాపురంలో వెలసిన మద్దిలేటి నరసింహస్వామి క్షేత్ర ఆదాయం రూ.2.72 లక్షలు సమకూరినట్లు ఉప కమిషనర్, ఆలయ నిర్వహణాధికారి రామాంజనేయులు, చైర్మన్ సీతారామచంద్రుడు శనివారం తెలిపారు. స్వామి, అమ్మవార్లను దర్శించుకునేందుకు ఉమ్మడి జిల్లాల నుంచే కాకుండా ఇతర ప్రాంతాల నుంచి అధిక సంఖ్యలో భక్తులు తరలి వచ్చారు. భక్తులు వేకువజాము నుంచే స్వామి అమ్మవార్లకు అభిషేకాలు, గండదీపాలు, ప్రత్యేక పూజలు చేసి పట్టు వెంట్రుకలు సమర్పించి మొక్కులు తీర్చుకున్నారు. ఈ సందర్భంగా స్వామి సేవా టికెట్లు, లడ్డూ ప్రసాదం, కేశఖండన, రూము బాడుగలు, లీజుల వసూళ్ల ద్వారా రూ.2,72,830ల ఆదాయం దేవస్థానానికి లభించినట్లు వారు తెలిపారు.

దివ్యాంగులకు ఇంటి వద్దనే విద్యాభ్యాసం

ప్యాపిలి, జూన్ 29: దివ్యాంగులకు ఇంటి వద్దనే విద్యాభ్యాసం నిర్వహించనున్నట్లు మండల విద్యాధికారి వెంకటేశ్వరనాయక్ తెలిపారు. నేనుపోతా బడికి కార్యక్రమంలో బాగంగా ఆయన ప్యాపిలి, పోతుదొడ్డి గ్రామంలో దివ్యాంగులను గుర్తించే కార్యక్రమాన్ని చేపట్టారు. ఆయన మాట్లాడుతూ మండలంలో మొత్తం 28 మంది దివ్యాంగులను గుర్తించినట్లు తెలిపారు. వయస్సును బట్టి తగిన తరగతుల్లో చేర్పిస్తామన్నారు. బడికి రాలేని దివ్యాంగ విద్యార్థులకు ప్రతి శనివారం ఉపాధ్యాయులు ఇంటికి వెళ్లి విద్యాభ్యాసం చేయడం జరుగుతుందన్నారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు ప్రసాద్‌నాయుడు, వెంకటరెడ్డి, సీఆర్పీలు రామాంజినేయులు, నవీన్ పాల్గొన్నారు.

వ్యవసాయంలో మెలకువలు పాటించాలి

వ్యవసాయ శాస్త్రవేత్తలు

రుద్రవరం, జూన్ 29 : వ్యవసాయంలో మెలకువలు పాటించాలని బనగానపల్లె కేవీకే శాస్త్రవేత్తలు డాక్టర్ బాలరాజు, సుధాకర్, రవిగౌడ్ అన్నారు. శనివారం రుద్రవరంలో వ్యవసాయ సిబ్బందికి ఒక్కరోజు శిక్షణ శిబిరం నిర్వహించారు. శాస్త్రవేత్తలు మాట్లాడుతూ కృషి విజ్ఞాన కేంద్రం సేవలు జిల్లా అంతటా రైతులకు అందించాలనే ఉద్దేశంతో శిక్షణ కార్యక్రమం నిర్వహించామన్నారు. సాగు చేసిన మొక్కజొన్న, మినుము, పసుపు వరి పంటలపై వచ్చే తెగుళ్ల, పురుగుల గురించి సిబ్బందికి వివరించారు. ఖరీఫ్ సీజన్‌లో మొక్కజొన్న సాగు చేసిన రైతులు 30 రోజుల వయసు ఉన్న పైరులో తప్పనిసరిగా ఎక్స్‌ట్రా కొనెజోల్ లీటరు నీటికి 2 ఎంఎల్ కలిపి పదిరోజుల వ్యవధిలో రెండుసార్లు పిచికారి చేయాలన్నారు. ఈ